
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి



ఖమ్మం

5

మంగళవారం ఉష్ణోగ్రత | ఖమ్మం : గరిష్ఠం 31 ; కనిష్ఠం 18 | భద్రాద్రి కొత్తగూడెం : గరిష్ఠం 32 ; కనిష్ఠం 20 | బుధవారం, 31 జనవరి 2024

పాలేరులో నేడు మంత్రి పొంగులేటి పర్యటన



కూసుమంచి, జనవరి 30: రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం పాలేరు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. తొలుత ఉదయం 10గంటలకు కూసుమంచిలోని క్యాంపుకార్యాలయంలో కూసుమంచి, నేలకొండపల్లి మండలాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తారు. అనంతరం కూసుమంచి మండలంలో పర్యటిస్తారు. సాయంత్రం 5 గంటలనుంచి ఖమ్మంలోని తన క్యాంపుకార్యాలయంలో అందుబాటులో ఉంటారు.

గ్రానైట్‌కు గడ్డుకాలం



- ఫ్యాక్టరీలు ప్రభుత్వానికి చెల్లించే రాయల్టీపై సబ్సిడీ ఎత్తివేత
- గతంలో ఇచ్చిన 40శాతం రిబేట్‌కు మంగళం
- వందశాతం రుసుం చెల్లించాలని సర్కారు ఉత్తర్వులు
- రోడ్డున పడనున్న గ్రానైట్ యజమానులు, కార్మికులు

ఖమ్మం ఖానాపురం హవేలీ, జనవరి 30: అసలే కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్న గ్రానైట్ పరిశ్రమకు ప్రభుత్వ నిర్ణయాలు శరాఘాతంగా మారుతున్నాయి. ఫ్యాక్టరీలు ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీ మీద సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం తొలగించడం సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేసింది. పరిశ్రమలు బ్యాంకులకు రుణాలను కూడా సకాలంలో చెల్లించలేని పరిస్థితుల్లో ప్రభుత్వం రాయల్టీపై 40శాతం సబ్సిడీని ఎత్తేయడంతో గ్రానైట్ పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపి ఫ్యాక్టరీలు మూతపడనున్నాయి. తద్వారా అటు పారిశ్రామికవేత్తలతో వాటిపై ఆధారపడి బతికే వేతన జీవులు కూడా ఇబ్బంది పడనున్నారు. ఉపాధిలేక వేలాది మంది కార్మికులు రోడ్డునపడు తున్నారు. ఒక్క ఖమ్మం జిల్లాలోనే 70శాతం పరిశ్రమలు మూత పడటానికి సిద్ధంగా ఉన్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసు కోవచ్చు. తాజాగా రాయల్టీని మొత్తాన్ని ఎత్తివేయ డంతో గ్రానైట్ పరిశ్రమ పరిస్థితి దయనీ యంగా మారింది. గత కొన్ని నెలలుగా గ్రానైట్ పరిశ్రమ పరిస్థితి అంధకారంగా ఉంది. ముడి పదార్థాల సమస్యతో పాటు, ఫినిషింగ్ చేసిన మెటీరియల్‌కు సరైన ధర లేక, కొనే వ్యాపారులు లేక ఫ్యాక్టరీల్లోనే స్టాక్ పెట్టాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం గ్రానైట్ పరిశ్రమకు గతంలో ఉన్న 40శాతం రాయల్టీ సబ్సిడీని ఎత్తేయడంతో పరిస్థితులు మరింత దిగజారను న్నా యి. ప్రస్తుతం జిల్లాలో 400 పరిశ్రమలు నడుస్తుండగా స్లాబ్‌సిస్టంలో మొత్తం రాయల్టి చెల్లించాల్సి రావటంతో మరికొన్ని పరిశ్రమలు మూతపడే అవకాశం ఉంది.



గతంలో 40శాతం సబ్సిడీ

గ్రానైట్ పరిశ్రమకు రాయల్టీలో గతంలో 40శాతం రాయితీ ఉండేది. 2009 మే 15న మొదటిసారి గ్రానైట్ పరిశ్రమకు ఈ విధానం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం నుంచి అమలవుతోంది. ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తరువాత కూడా ప్రభుత్వం ఈ విధానాన్ని అమలు చేస్తూ వచ్చింది. అయితే తాజాగా జనవరి 25న గత ప్రభుత్వం ఇచ్చిన గడువు ముగిసింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఈ విధానాన్ని రెన్యువల్ చేయకుండా ఎత్తేసింది. వందశాతం రుసుం చెల్లించాల్సిందేనని, రాయితీ అనేదే లేదని ఉత్తర్వులు జారీచేసింది. దీంతో గ్రానైట్ పరిశ్రమలపై విపరీతమైన భారం పడనుంది. ప్రతీ రెండేళ్లకోసారి రాయితీని రెన్యూవల్ చేసే ప్రభుత్వం ఈ ఏడాది మాత్రం రెన్యూవల్ చేయకుండా ఉన్న రాయితీని ఎత్తేసి వందశాతం రాయల్టీ కట్టాల్సిందేనని ఉత్తర్వులు జారీచేయడం గ్రానైట్ పరిశ్రమలకు గుదిబండగా మారింది.



పెరగనున్న రుసుం ఇలా..

సాధారణంగా గ్రానైట్ ఫ్యాక్టరీల్లో అధిక యూనిట్లు నాలుగు కట్టర్లతో ఉంటాయి. నాలుగు యూనిట్లు ఉన్నవారు 40శాతం రాయితీ ప్రకారం రూ.33,600, సెస్‌ఫీజు రూ.1,600, డీఎంఎఫ్‌టీ రుసుం రూ.6,720, ఎస్ఎంఈటీ రుసుం రూ.672, టీడీఎస్ రుసం రూ.672 చెల్లించేవారు. అంటే నాలుగు కట్టర్లకు మొత్తం రూ.43,264 చెల్లించేవారు. కాగా ప్రస్తుతం రాయితీ లేకపోవడంతో అదనంగా 40శాతం చెల్లించాల్సి ఉంటుంది. ఆ లెక్కన నాలుగు కట్టర్లు ఉన్నవారు రుసుం రూ.56,000, సెస్‌కు రూ.1,600, డీఎంఎఫ్‌టీ రూ.11,200, ఎస్ఎంఈటీ రూ.1,120, టీడీఎస్ రూ.1,120లతో కలిపి మొత్తం రూ.71,040 చెల్లించాల్సి ఉంటుంది. ఖమ్మం జిల్లాలో 2022-23 సంవత్సరానికి కట్టర్లలో స్లాబ్ కట్టర్లు 14,471, టైల్స్ యూనిట్లు 1,879 ఉండగా వీటిన్నింటికీ ఆయా ఫ్యాక్టరీల యజమానులు 40శాతం రాయితీతో రాయల్టీ చెల్లించాయి. వాటి ప్రకారం స్లాబ్ రెవెన్యూ రూ.14,71,83,965, టైల్స్ రెవెన్యూ రూ.36,52,504ను ప్రభుత్వానికి చెల్లించాయి. 2023-24 సంవత్స రంలో గత డిసెంబరు వరకు స్లాబ్ యూనిట్లు 11,705, టైల్స్‌యూనిట్లు 1,433 పనిచేశాయి. వాటికి సంబంధించి స్లాబ్ రెవెన్యూ రూ.10,17,66,000, టైల్స్ రెవెన్యూ రూ.2,58,1,482ను ప్రభుత్వానికి 40శాతం రాయితీతో ఫ్యాక్టరీ యజమానులు చెల్లించారు.

ప్రస్తుతం ఒక్కో ఫ్యాక్టరీపై నెలకు రూ.27వేల భారం

ప్రభుత్వం రాయల్టీపై 40శాతం సబ్సిడీని ఎత్తివేయడంతో జిల్లాలోని సుమారు 400 స్లాబ్, 120 టైల్స్ గ్రానైట్ పరిశ్రమలపై తీవ్ర ఆర్థిక భారం పడనున్నది. గతంలో నాలుగు కట్టర్లు ఉన్న స్లాబ్ గ్రానైట్ పరిశ్ర యజమానులు నెలకు రాయల్టీతోపాటు టాక్స్‌లు కలిపి రూ.43,264 చెల్లించేవారు. కానీ ప్రస్తుతం సబ్సిడీ ఎత్తివేయటంతో రూ.71,004 చెల్లించాల్సి ఉంటుంది. దీంతో ఒక్కో పరిశ్రమపై నెలకు సుమారు రూ.27వేల అదనంగా భారం పడనున్నది. జిల్లా వ్యాప్తంగా నెలకు రూ.1కోటి 80లక్షల వరకు అదనపు భారం పడనున్నది. సంవత్సరానికి సుమారు రూ.13కోట్ల భారం పడనున్నది. జిల్లాలో ప్రస్తుతం 120టైల్స్ పరిశ్రమలు నడుస్తున్నాయి. ఒక్కో పరిశ్రమపై నెలకు 8వేల అదనపు భారం పడనున్నది. నెలకు పరిశ్రలపై సుమారు రూ.10లక్షల అదనపు భారం పడనున్నది. సంవత్సరానికి రూ.1కోటి, 20లక్షల అదనపు భారం పడనున్నది. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ భారాన్ని భరించే పరిస్థితుల్లో తాము లేమని, ప్రభుత్వం గ్రానైట్ పరిశ్రమను ఆదుకొని గతంలో ఉన్న రాయల్టీపై 40 శాతం సబ్సిడీని కొనసాగించాలని ఫ్యాక్టరీల యజమానులు కోరుతున్నారు.



మంత్రుల సహకారంతో సబ్సిడీకి కృషి

ఉప్పల వెంకటరమణ, గ్రానైట్‌స్లాబ్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు



ప్రస్తుత పరిస్థితుల్లో గ్రానైట్ పరిశ్రమ తీవ్ర ఇబ్బందుల్లో ఉంది. ఈ సమయంలోనే ప్రభుత్వం రాయల్టీపై ఉన్న 40 శాతం సబ్సిడీని ఎత్తివేయడంతో పరిశ్రమ మనుగడ కష్టంగా మారింది. జిల్లాకు చెందిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో త్వరలోనే రాయల్టీపై గతంలో ఉన్న 40 శాతం సబ్సిడీని తెచ్చేందుకు కృషి చేస్తాం. జిల్లా మంత్రులకు గ్రానైట్ పరిశ్రమల సమస్యలపై అవగాహన ఉన్నందున వారి సహకారంతో గ్రానైట్ పరిశ్రమకు 40 శాతం సబ్సీడీ ఇచ్చేలా తప్పకుండా సహకారం అందిస్తారు.



తూనికలశాఖ ఖాళీ

- ఇన్‌చార్జ్‌లతోనే కొనసాగుతున్న పాలన
- జిల్లా అధికారి సహా భద్రాచలం, ఖమ్మం, మధిర ఇన్‌స్పెక్టర్ పోస్టులు ఖాళీ
- పూర్తిస్థాయి అధికారులు లేక వ్యాపారుల ఇష్టారాజ్యం

ఖమ్మం, జనవరి 30(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో కీలకమైన తూనికలు కొలతల శాఖలో ఏళ్లుగా ఇన్‌చార్జ్ పాలన కొనసాగుతోంది. ఖాళీ పోస్టులను ప్రభుత్వం భర్తీచేయకపోవడంతో ఇన్‌చార్జ్‌లతోనే ఆ శాఖ పాలన కొనసాగుతోంది. జిల్లా తూనికలు, కొలతల అధికారి పోస్టుతో పాటు స్థానిక ఇన్‌స్పెక్టర్ పోస్టుతో పాటు వైరా, భద్రాచలం ఇన్‌స్పెక్టర్ పోస్టులు కూడా ఖాళీగానే ఉన్నాయి. ప్రస్తుతం వ్యవసాయ సీజన కావడగంతో గ్రామాలు, మండలాల్లో, వ్యవసాయ మార్కెట్లలో పత్తి, మిర్చి, ధాన్యంతోపాటు పలు రకాల పంటల కొనుగోలు జరుగుతున్నాయి. కొన్నిచోట్ల ఇష్టానుసారంగా తూకాలు వేస్తూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. ఖమ్మం వంటి కీలకమైన జిల్లాలోనూ తూనికలు, కొలతల శాఖలో పోస్టులు భర్తీచేయకపోవడంతో దూరప్రాంతాల నుంచి ఇన్‌చార్జ్‌లకు బాధ్యతలు అప్పగించడం వల్ల విధి నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం ఖమ్మం జిల్లా తూనికలు, కొలతల శాఖల అధికారిగా మహబాద్ జిల్లా అధికారి ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. జిల్లా కేంద్రంలో ఇన్‌స్పెక్టర్ పోస్టు ఖాళీగా ఉంది. ఖమ్మం వంటి జిల్లా కేంద్రంలోనూ ఆ శాఖ అధికారులు లేకపోవడం గమనార్హం. రాష్ట్రంలోనే అతిపెద్ద వ్యవసాయ మార్కెట్లలో ఖమ్మం మార్కెట్ ఒకటి.. ఇక్కడ మిర్చి, పత్తి, అపరాలు, మొక్కజొన్నలు తదితర పంటల కొనుగోలు చేస్తుంటారు. అలాగే జిల్లాలో మధిర, వైరా, సత్తుపల్లి, పాలేరు నియోజకవర్గాల్లో సైతం వ్యవసాయ ఉత్పత్తులు అధికంగానే వస్తుంటాయి. ప్రస్తుతం ధాన్యం, మిర్చి, పత్తి సీజన్ నడుస్తోంది. వ్యవసాయ ఉత్పత్తులతో పాటు తూనికలు, కొలతల శాఖల అధికారులు ఇటు తూనికలు కొలతలతోపాటు వస్త్రదుకాణాలు, హోంనీడ్స్, మిల్లులు తదితర చోట్ల కూడా నిత్యం తనిఖీలు చేయాల్సి ఉంటుంది. ఎమ్మార్పీ మార్పు కూడా నిఘాపెట్టాల్సి ఉంటుంది. ఖమ్మంలో జిల్లా అధికారి పోస్టుతోపాటు ఇన్‌స్పెక్టర్ పోస్టు ఏడాదికాలంగా ఖాళీగా ఉన్నాయి. ఇన్‌చార్జ్ పాలనతోనే ఖమ్మం, మధిర, భద్రాచలం కార్యాలయాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా కార్యాలయాలకు పూర్తిస్థాయి అధికారులను నియమించాలని పలువురు కోరుతున్నారు.

గంజాయ్ రూట్

- ఉమ్మడి జిల్లా నుంచి భారీగా గంజాయి అక్రమరవాణా
- అశ్వారావుపేట ప్రాంతాన్ని రక్షితప్రాంతంగా భావిస్తున్న స్మగ్లర్లు
- ఎంత నిఘా పెట్టినా కొత్తపంథాలో కొనసాగుతున్న దందా

ఇటీవల ఖమ్మంలో పట్టుబడ్డ గంజాయి చాక్లెట్లు

ఖమ్మం సంక్షేమవిభాగం/ అశ్వారావుపేట, జనవరి 30: ఎంత నిఘా పెట్టినా గంజాయి స్మగ్లర్లు కొత్తపంథాలో తమ దందా కొనసాగిస్తున్నారు. ఏపీతో పాటు తెలంగాణలోనూ గంజాయి అక్రమ రవాణ భారీగా పెరిగిపోయింది. ఇటీవలే హైదరాబాదుతో పాటు ఖమ్మం, కొత్తగూడెం, భద్రాచలం ప్రాంతంలో భారీగా పట్టుబడిన గంజాయి సంఘటనలే దీనికి నిదర్శనంగ చెప్పవచ్చు. అక్రమార్కులు ఎప్పటికప్పుడు కొత్త ఎత్తులతో తమ దందాను విస్తరిస్తున్నారు. అందుకు భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మార్గాన్ని సురక్షిత ప్రాంతంగా ఎంచుకుంటున్నారు. అశ్వారావుపేట నుంచి హైదరాబాదుకు హైవేరోడ్డు సురక్షితంగా ఉంటుందని స్మగ్లర్లు భావిస్తున్నారు. ఈ మార్గంలోనే విశాఖ, తూర్పుగోదావరి జిల్లా ఏజెన్సీ ఒడిశా ఏజెన్సీ ప్రాంతాలనుంచి హైదరాబాదు, ముంబాయి వంటి ప్రాంతాలకు గంజాయిని అశ్వారావుపేట మీదుగానే రవాణా చేస్తున్నారు. పాలు, కూరగాయలు, కిరాణా సరుకులు, కోడిగుడ్లు, మందుల మాటున వ్యాన్‌లు, లారీల్లో గంజాయి తరలిపోతోంది. ఏపీ సరిహద్దులోని జీలుగుమిల్లి, అశ్వారావుపేట చెక్ పోస్టు, మందలపల్లి, సత్తుపల్లి, తల్లాడ, వైరా తదితర ప్రాంతాల్లో అనేకమార్లు లారీలలో తరలిస్తూ గంజాయి పట్టుబడిన సంఘటనలే దీనికి నిదర్శనం. ఛత్తీస్‌గఢ్ ఏజెన్సీ నుంచి కొత్తగూడెం, వరంగల్‌మీదుగా రవాణా చేయడంతో పాటు అశ్వారావుపేట నియోజకవర్గం అశ్వారావుపేట, ములకలపల్లి మీదుగ గంజాయి వంటి మత్తుపదార్థాలను భారీగా తరలిస్తుంటారు. భద్రాచం ప్రాంతంలో పోలీసు ఎక్సైజ్ నిఘా పెరగడంతో అశ్వారావుపేట మార్గాని స్మగ్లర్లు సురక్షిత ప్రాంతంగా భావిస్తున్నారు. ఇక భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి, చంద్రుగొండ ప్రాంతాల్లో గంజాయి అమ్మకాలు చాపకింద నీరులా పెరిగిపోతున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతంలోని యువత గంజాయితో పాటు మత్తు కలిగించే టానిక్‌లు, సొల్యూషన్‌లు, మాత్రలను ఉపయోగించిన ఉదంతాలు ఉన్నాయి. రెండేళ్ల క్రితం అశ్వారావుపేటలో గంజాయి విక్రయాలు చేస్తున్నవారిని పోలీసులు అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు. గంజాయి అమ్మకాలపై ఉక్కుపాదం మోపుతామని, మూలాల వరకు వెళ్లి అందుకు కారణమైనవారి పట్టుకుంటామంటూ పోలీసులు ప్రకటించినా అది పూర్తిస్థాయిలో సాధ్యం కావడం లేదు. గంజాయి అక్రమ రవాణాపై కూడా పెద్దగా చర్యలు లేవనే విమర్శలు ఉన్నాయి. గంజాయి రవాణా, అమ్మకాలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోకపోతే పల్లెల్లోనూ ఈ మత్తు మహమ్మారి వినియోగం భారీగా పెరిగి అనేక అనర్థాలకు దారి తీస్తుందనే ఆందోళన ప్రజల్లో వ్యక్తమవుతోంది.

దీనిపై అశ్వారావుపేట ఎస్ఐ శ్రీకాంత్‌ను వివరణ కోరగా గంజాయి రవాణా, అమ్మకాలపై తమకు ఎటువంటి సమాచారం లేదని, ఎవరైనా సమాచారం అందిస్తే నిఘా వేసి పట్టుకుంటామని తెలిపారు.

అసలు మాఫియా కోసం వేట

రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారిన గంజాయి చాక్లెట్ల రాకెట్ వెనుక పెద్ద మాఫీయానే ఉన్నట్లు ఎక్సైజ్‌శాఖ అధికారులు అనుమానిస్తున్నారు. దాంతో ఈ వ్యవహారంపై విచారణ నిర్వహిస్తున్నారు. ఖమ్మం టాస్క్‌ఫోర్స్ అధికారులకు చిక్కిన మహిళలను విచారించగా తాము కేవలం భద్రాచలం నుంచి హైదరాబాద్‌కు తరలించేందుకు మాత్రమే పనిచేస్తామని చెప్పినట్లు తెలిసింది. దీంతో గంజాయి చాక్లెట్ల తయారీ రాకెట్‌ను కనుగునేందుకు ఖమ్మం ఎక్సైజ్‌శాఖ అధికారులతో పాటుగా రాష్ట్రస్థాయి బృందాలు ప్రత్యేకంగా వేట ప్రారంభించాయి.





ఇటీవల పట్టుబడిన సరుకుతో నిందితులు

చాక్లెట్ల రూపంలో గంజాయి

పోలీసులు, ఎక్సైజ్ శాఖల నిఘా పెరిగిపోవడంతో గంజాయి దందా కొత్త పంథాలో సాగుతోంది. గతంలో పచ్చి గంజాయిని మాత్రమే రవాణా చేయగా ఎక్సైజ్‌శాఖ అధికారులు నిఘా పెంచటంతో ఎండు గంజాయిగా, గంజాయి నీరుగా మార్పులు చేసి అక్రమంగా రవాణా చేసేవారు. కానీ ఎక్సైజ్, పోలీసుశాఖ వాటిని కూడా పసిగట్టడంతో ఇప్పుడు మరో కొత్త పంథాతో తరలించేందుకు గంజాయి ముఠా తెగబడింది. ప్రాథమిక స్థాయి విద్యార్థులు నుంచి ఉన్నతస్థాయి విద్యార్థులు, సాఫ్టవేర్ ఉద్యోగులను ఆకర్షించేలా ఎండు గంజాయిని గుండ్రంగా తయారు చేసి ఆకర్షణీయమైన చాక్లెట్ ప్యాకింగ్‌లో తయారు చేస్తున్నారు. గత రెండు నెలలుగా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలో చర్చనీయాంశంగా మారిన గంజాయి చాక్లెట్లు గుట్టు ఖమ్మంలో రట్టయింది.

ఖమ్మంలో గంజాయి చాక్లెట్ల పట్టివేత

మహారాష్ట్రలోని ఔరంగబాద్‌కు చెందిన ఇద్దరు మహిళలు ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో గంజాయి చాక్లెట్లను తీసుకొని భద్రాచలం బస్టాండ్‌కు వచ్చి అక్కడ నుంచి హైదరాబాద్‌కు మరో బస్సులో బయలుదేరారు. అయితే ముందస్తు సమాచారంతో కాపుకాసిన ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఖమ్మంలో కాపుకాసి బస్సులో ప్రయాణిస్తున్న ఇద్దరు మహిళలను ఖమ్మం వరంగల్ క్రాస్ రోడ్డు వద్ద తనిఖీలు చేపట్టారు. వారి నుంచి ఆకర్షనీయమైన ప్యాకింగ్‌లో ఉంచిన 3 కేజీల గంజాయి చాక్లెట్లు, మరో 8కేజీల ఎండు గంజాయిని ఎక్సైజ్‌శాఖ అధికారులు స్వాధీనం చేసుకొని నిందితులను అదుపులోకి తీసుకున్నారు.



అడుగంటిన పాలేరు జలాశయం

నేడు పాలేరుకు

సాగర్ జలాల విడుదల

కూసుమంచి, జనవరి 30: నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి పాలేరు జలాశయానికి బుధవారం అధికారులు సాగర్ జలాలు విడుదల చేయనున్నారు. పాలేరు జలాశయం అడుగంటి పోవడంతో జిల్లాలో తాగునీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఏర్పడింది. పాలేరు జలాశాయం పూర్తిస్థాయి నీటిమట్టు 23 అడుగులకు గాను ప్రస్తుతం కేవలం 11.30 అడుగులకు మాత్రమే నీరు నిల్వ ఉంది. వచ్చేది వేసవి సీజన్ కావడంతో ఖమ్మం జిల్లాతోపాటు పరిసర సూర్యాపేట, హహబూబాబాద్ జిల్లాలకు తాగునీటి ఎద్దడే ఏర్పడే ప్రమాదం ఉంది. నీటిపారుదలశాఖ అధికారులు ఈ పరిస్థితిని మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో బుధవారం సాయంత్రం సాగర్ డ్యామ్ నుంచి పాలేరుకు సాగర్ జలాలు విడుదల చేసే అవకాశం ఉందని సమాచారం.

మళ్లీ దక్కేనా?

- వద్దిరాజుకు రాజ్యసభలో స్థానంపై ఉత్కంఠ
- ఏప్రిల్ 2న ముగియనున్న ఆయన పదవీకాలం
- త్వరలో పెద్దల సభ ఎన్నికలకు నోటిఫికేషన్

ఖమ్మం, జనవరి 30(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు రాజ్యసభ సభ్యుల్లో వద్దిరాజు రవిచంద్ర పదవీకాలం గడువు ముగుస్తున్న నేపథ్యంలో మళ్లీ ఆయనకు కొనసాగింపు ఉంటుందా లేదా అని బీఆర్‌ఎస్‌లో చర్చ సాగుతోంది. రాజ్యసభకు ఫిబ్రవరి 27న ఎన్నికలు నిర్వహిస్తుండగా జిల్లానుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న వద్దిరాజు రవిచంద్ర పదవీకాలం ఏప్రిల్ 2న ముగియనుంది. తిరిగి రాజ్యసభకు ఎన్నికైతేనే ఆయన కొనసాగే అవకాశం ఉంది. జిల్లానుంచి మరో రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారధిరెడ్డికి ఆరేళ్లపాటు రాజ్యసభకు అవకాశం దక్కడంతో ఇప్పటికీ ఆయన పదవీకాం రెండేళ్లే పూర్తవుతోంది. అయితే వద్దిరాజు రవిచంద్ర రెండేళ్ల గడువుతోనే బీఆర్‌ఎస్‌నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఇప్పుడు జరగబోతున్న రాజ్యసభ ఎన్నికల్లో ఫిబ్రవరి 8నుంచి నామినేషన్లు ఉన్నందున బీఆర్‌ఎస్‌కు ఒకే రాజ్యసభ సీటు దక్కే అవకాశం ఉండంతో ఆ పార్టీ ఎవరికి అవకాశం కలిపిస్తుందన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. వాస్తవానికి రెండేళ్ల గడువున్న రాజ్యసభ సీటుకు ఉప ఎన్నికలో వద్దిరాజును ఎంపికచేసినప్పుడు మళ్లీ కొనసాగింపు ఉంటుదన్న భరోసా పార్టీ నుంచి ఉంది. తెలంగాణలో మారిన రాజకీయ పరిస్థితులు, అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమితో రాజ్యసభకు ఎన్నికయ్యే అభ్యర్థుల సంఖ్య తగ్గింది. ఒకరికి మాత్రమే బీఆర్‌ఎస్ నుంచి నియమించే అవకాశం ఉంది. వచ్చే నెల 8న రాజ్యసభ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతున్నందున వద్దిరాజుకు మళ్లీ అవకాశం లభిస్తుదా లేదా అన్నదానిపై బీఆర్‌ఎస్‌లో ఉత్కంఠత నెలకొంది. ఇటీవల ఆయన జన్మదిన వేడుకలను రాబోతున్న రాజ్యసభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఘనంగా నిర్వహించారు. జిల్లానుంచి బండి పార్థసారధిరెడ్డి బీఆర్‌ఎస్‌నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఎంపీగా నామా నాగేశ్వరరావు ఉన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లోనూ ఖమ్మం నుంచి నామానే అభ్యర్థి అని ఇప్పటికే ఏకాభిప్రాయంతో నిర్ణయించారు. అయితే పూర్తిస్థాయి కాలం కాకుండా రెండేళ్ల పరిమితితో రాజ్యసభకు ఎన్నికైనందున మరో అవకాశం ఉంటుందని వద్దిరాజు వర్గంలో ధీమా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఎవరికి రాజ్యసభ అవకాశం కలిపిస్తారన్నదానిపై పార్టీలో చర్చ జరుగుతోంది.



రుచి,శుచి పెరగాలి

- గిరిజన విద్యార్థులకు ఇకపై ప్రత్యేక మెనూ
- నేటినుంచి ఐటీడీఏ పరిధిలోని విద్యాసంస్థల్లో అమలు
- ఆహార పదార్థాల తయారీలో పరిశుభ్రతకు ప్రాధాన్యం
- పీవో ప్రతీజ్‌జైన్ క్షేత్ర పరిశీలనతో ప్రక్షాళన

భద్రాచలం, జనవరి 30: గిరిజన విద్యాసంస్థల్లో విద్యార్థులకు ఇకపై రుచికరమైన ఆహార పదార్థాలు అందుబాటులోకి రానున్నాయి. ఇంతకాలం విద్యార్థులకు ఒక క్రమపద్ధతిలో కాకుండా ఇష్టానుసారం ఆహార పదార్థాలను అందించేవారు. దీంతో విద్యార్థులు సైతం వాటిని తినేందుకు అంతగా ఆసక్తి చూపేవారు కాదు. దాంతో పిల్లలకు ఇంటి వంటను మరింపించేలా రుచికరమైన ఆహారాన్ని అందించేందుకు ఐటీడీఏ అధికారులు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా రెండు రోజుల పాటు ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు వసతి గృహాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న కుక్, కామటి, నాలుగో తరగతి సిబ్బందితో పాటు ఏటీడీవోలు, ప్రధానోపాధ్యాయుల సమక్షంలో సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ముదురోజే కావాల్సిన సరుకులు, కూరగాయలు, ఇతరత్రా సరిచూసుకోవడం ఒక వేళ లేకుంటే వార్డెన్ లేదా ప్రధానోపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లాలని సిబ్బందికి సూచించారు. ఆహార పదార్థాల ముడి సరుకులు, కూరగాయలు సన్నద్ధం చేయడంతో పాటు పరిశుభ్రతకు, వ్యక్తిగత శుభ్రతకు ప్రాధాన్యమిచ్చేలా సిబ్బందికి వైద్య ఫుడ్ సిబ్బంది శిక్షణ ఇచ్చారు.

పీవో పరిశీలనతో ప్రక్షాళన

ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో గత కొంత కాలంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో పలుచోట్ల ఆయన ఆహార పదార్థాల తయారీ, వాటి రుచిని స్వయంగా పరిశీలించారు. సంబంధిత పాఠశాలల విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ క్రమంలో పలుచోట్ల విద్యార్థులకు రుచికరమైన ఆహారం అందడం లేదని, మరికొన్ని చోట్ల శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఆయన గుర్తించారు. దీంతో భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల పరిధిలోని ఆశ్రమ ఉన్నత పాఠశాలలు, వసతి గృహాలకు చెందిన సంబంధిత జిల్లాల సిబ్బందికి ఒకేసారి శిక్షణ ఇస్తున్నారు. ఇలా 60 ఆశ్రమ పాఠశాలలు, 27 వసతి గృహాలు, 41 పోస్టుమెట్రిక్ వసతి గృహాల్లో ఉన్న మొత్తం 25వేల మంది విద్యార్థులకు రుచికరమైన ఆహారాన్ని అందించేందుకు చర్యలు చేపట్టారు.

నేటి నుంచి ప్రత్యేక మెనూ

కరోనా సమయం నుంచి వసతి గృహాల్లో పలుచోట్ల ఆహార పదార్థాలు సరైన రీతిలో వండటం లేదని అధికార వర్గాలు అంతర్గతంగా పేర్కొంటున్నాయి. ఈ క్రమంలో సంబంధిత సిబ్బందికి శిక్షణ ఇవ్వడంతో మంగళవారం నుంచి ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో రుచికరమైన మెనూ అందుబాటులోకి రానుందని అధికారులు తెలిపారు.



భద్రాచలంలో రుచికరమైన వంటలపై డెమో నిర్వహిస్తున్న దృశ్యం

రాజీవ్ ట్రోఫీ ఫైనల్స్‌కు

ఖమ్మం అర్బన్, వీఎంబంజర జట్లు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మానుకొండ

ఖమ్మం స్పోర్ట్స్, జనవరి 30: ఖమ్మం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో జరుగుతున్న రాజీవ్‌గాంధీ మెమోరియల్ రాజీవ్ ట్రోఫీ ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ఫైనల్స్ దశకు చేరుకున్నాయి. తుది పోరుకు ఖమ్మం అర్బన్, వీఎం.బంజర జట్లు చేరుకున్నాయి. పోటీలను మార్కెట్ కమిటీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్ క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. మంగళవారం జరిగిన సెమీఫైనల్స్ పోటీలలో ఖమ్మం అర్బన్ జట్టు సత్తుపల్లి జట్టుపై, వీఎం బంజర జట్టు తల్లాడ జట్టుపై విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకున్నాయి. బుధవారం ఫైనల్స్ పోటీలను నిర్వహించనున్నారు.

ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించాలి

- ఫొటో సిమిలరీ ఎంట్రీలపై దృష్టిసారించాలి
- ఎలక్టోరల్ రోల్ పరిశీలకులు బాలమాయాదేవి



సమీక్ష నిర్వహిస్తున్న ఎన్నికల ఇన్‌చార్జ్

ఖమ్మంకలెక్టరేట్, జనవరి 30: జిల్లాలో ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించాలని ఉమ్మడి జిల్లా ఓటరు జాబితా పరిశీలకురాలు, చీఫ్ రేషనింగ్ అధికారి బాల మాయాదేవి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ వి.పి. గౌతమ్‌తో కలిసి, ఎస్ఎస్ఆర్-2024 (స్పెషల్ సమ్మరీ రివిజన్, ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమం) ఓటరు జాబితా రూపకల్పనపై ఆర్వోలు, ఏఆర్వోలతో ఆమె సమీక్షించారు. బాల మాయాదేవి మాట్లాడుతూ, ఎస్ఎస్ఆర్-2024 ప్రక్రియలో ప్రతి అంశంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఫోటో సిమిలర్ ఎంట్రీ, డెమోగ్రాఫిక్ సిమిలర్ ఎంట్రీ ల విషయమై యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాల ప్రకారం నిర్దేశిత గడువులోగా ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో ఓటింగ్ శాతం బాగా నమోదయ్యిందని, ఎన్నికలు విజయంతంగా చేపట్టిన జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ వీపీ గౌతమ్‌తో పాటు , ఎన్నికల అధికారులను ఆమె అభినందించారు.

సమీక్షలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ జిల్లాలో చేపడుతున్న ఎస్ఎస్ఆర్-2024 ప్రక్రియపై పరిశీలకులకు వివరించారు. ఆయన మాట్లాడుతూ, 18-19 సంవత్సరాల వయస్సు వారిపై ప్రత్యేక దృష్టి సారించి ఓటరుగా నమోదు చేయించామన్నారు. ఓటరు జాబితాలో సుమోటోగా సవరణలు చేశామన్నారు. ఆబ్సెంట్, షిఫ్ట్, డెత్ ఓటర్ల విషయంలో ఫారం-7 ద్వారా దరఖాస్తులు స్వీకరించామన్నారు. జాబితాపై అభ్యంతరాలు స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. 31 పోలింగ్ కేంద్రాల పేరు మార్పుకు ప్రతిపాదనలు సమర్పించామన్నారు. ఇపీ రేషియో 699 గా ఉన్నట్లు ఆయన తెలిపారు. ఓటరు కార్డుల పంపిణీ 10 నవంబరు, 2023 వరకు అప్డేట్ అయిన దరఖాస్తుదారులకు చేపట్టినట్లు, అసెంబ్లీ ఎన్నికల తర్వాత దరఖాస్తుదారులకు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. 100 సంవత్సరాల పైబడి వయస్సు గల ఓటర్ల విషయమై క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నామన్నారు. ఎస్ఎస్ఆర్ కార్యాచరణపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నియోజకవర్గ స్థాయిలో ప్రతి బుధవారం, జిల్లా స్థాయిలో ప్రతి గురువారం సమావేశాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. గత పబ్లికేషన్ నుంచి ఈ నెల 6న డ్రాఫ్ట్ పబ్లికేషన్ వరకు 3073 ఓటర్లు చేరగా, 3037 మంది తొలగింపులు చేసినట్లు, డ్రాఫ్ట్ పబ్లికేషన్ ప్రకారం 1216832 మంది ఓటర్లు ఉన్నట్లు ఆయన అన్నారు. 26782 మంది పిడబ్ల్యూడి, 18588 మంది సీనియర్ సిటిజన్ ఓటర్లు ఉన్నారన్నారు. పూర్తి పారదర్శకంగా ఓటరు జాబితా రూపకల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, ఖమ్మం నగర పాలక సంస్థ కమీషనర్ ఆదర్శ్ సురభి, ఆర్డీవోలు జి. గణేష్, అశోక్ చక్రవర్తి, ఎస్డీసి ఎం. రాజేశ్వరి, జిల్లా ఉపాధి కల్పన అధికారి కె. శ్రీరామ్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ఏ. శ్రీనివాస్, ఖమ్మం అర్బన్, ఖమ్మం రూరల్, వైరా, మధిర, సత్తుపల్లి మండల తహశీల్దార్లు, కలెక్టరేట్ ఎన్నికల విభాగసూపరింటెండెంట్ రాంబాబు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ కార్యకలాపాలు

విస్తృతంగా నిర్వహించాలి



సమావేశానికి హాజరైన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు

ఖమ్మం స్పోర్ట్స్ జనవరి 30: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నేషనల్ సర్వీస్ స్కీమ్(ఎన్ఎస్ఎస్) కార్యకలాపాలను విస్తృతంగా నిర్వహించాలని కాకతీయ యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఇ. నారాయణ అన్నారు. మంగళవారం ఖమ్మం నగరంలోని కేఎండీసీ కళాశాలలో జరిగిన ఉమ్మడి జిల్లా ఎన్ఎస్ఎస్ అధికారుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వలంటీర్లకు సమాజ సేవా కార్యక్రమాలపై అవగాహన కల్పించి వారిని అధిక సంఖ్యలో పాల్గొనే విధంగా సన్నద్ధం చేయాలని అన్నారు. ఎన్ఎస్ఎస్ కార్యకలాపాలు ఏవిధంగా నిర్వహించాలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్‌లు శ్రీనివాస్, ఆనంద్‌బాబు, కళాశాల ప్రిన్సిపాల్ రమణారావు ఎన్ఎస్ఎస్ పిఓలు పాల్గొన్నారు.

పాలక మండలి సమావేశానికి సిద్ధం కావాలి

అధికారుల సమీక్షలో ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్



మాట్లాడుతున్న పీవో ప్రతీక్‌జైన్

భద్రాచలం, జనవరి 30: వచ్చే నెలలో జరిగే ఐటీడీఏ పాలక మండలి సమావేశానికి ఎటువంటి అసౌకర్యం, లోటుపాట్లు కలగకుండా సంబంధిత యూనిట్ అధికారులు సిద్ధం కావాలని భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ అన్నారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం వివిధ శాఖల యూనిట్ అధికారులతో పీవో సమీక్ష నిర్వహించారు. సమావేశానికి రాష్ట్ర మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు, రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు, కలెక్టర్లతో గిరిజన ప్రజా ప్రతినిధులు హాజరు కానున్నారని తెలిపారు. ఈ సమావేశంలో గిరిజనులకు ఐటీడీఏ తరఫున అందించే సంక్షేమ పథకాలకు సంబంధించిన అంశాలను నివేదికల రూపంలో తయారు చేయాలని, అలాగే బడ్జెట్‌కు సంబంధించిన ప్రతిపాదనలు వెంటనే పై అధికారులకు నివేదించి బడ్జెట్‌ను తెప్పించుకోవాలని, ఐటీడీఏ కార్యాలయంతో పాటు పరిసరాలు, కార్యాలయ గదులు, సమావేశం హాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. గత పాలక వర్గ సమావేశంలో వెల్లడించిన సమస్యలు, వాటి పరిష్కార నివేదికలను పంపించిన జాబితాలు యూనిట్ అధికారులు వారికి తెలియజేయాలని ఆదేశించారు. సమావేశంలో సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్‌రాజు, గిరిజన సంక్షేమ శాఖ డీడీ మణెమ్మ, ఎస్‌వో సురేష్‌బాబు, జీసీసీ డీఎం విజయ్‌కుమార్ డీటీఆర్‌వోఎఫ్ఆర్ శ్రీనివాస్, ఏడీ అగ్రికల్చర్ భాస్కర్, ఏపీవో పవర్ మునీర్‌పాషా పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై కలెక్టర్‌కు

బీరోలు గ్రామస్థుల ఫిర్యాదు

తిరుమలాయపాలెం, జనవరి30: మండలంలోని బీరోలు గ్రామ పంచాయతీలో జరిగిన అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీరోలు గ్రామస్థులు కలెక్టర్ వీపీ గౌతమ్‌కు ఫిర్యాదు చేశారు. బీరోలు గ్రామ పంచాయతీకి అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం సుమారు రూ.3.50కోట్లు నిధులు మంజూరుచేసిందని, దీనిలో సుమారు కోటిరూపాయల మేరకు పనులు చేయకుండా చేసినట్టు చూపించి సర్పంచ్ అలివేలమ్మ, పంచాయతీ కార్యదర్శి రమణ, ఉప సర్పంచ్ విక్రమ్‌రెడ్డి డ్రా చేసి దుర్వినియోగానికి పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై పంచాయతీ సమావేశంలో సభ్యులు అడిగితే దబాయిస్తున్నారని వివరించారు. అలాగే హరితహారంలో కూడా అవినీతి, అక్రమాలు జరిగాయని, మొక్కలు వేయకుండానే నిధులు డ్రాచేశారని తెలిపారు. అలాగే క్రీడాప్రాంగణం పనుల్లో కూడా అవినీతి జరిగిందని, క్రీడాప్రాంగణానికి సుమారు రూ.2.40లక్షలు నిధులు డ్రాచేశారని, దీనిలో కూడా అవినీతి అక్రమాలు చోటుచేసుకున్నాయని తెలిపారు. గ్రామంలో ఈ ఐదేళ్లలో పంచాయతీలో పారిశుధ్య పనులలో కూడా అవినీతి జరిగిందని, వీటిపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో సీహెచ్ ఉపేందర్, ఎస్‌కేజానిబాబు, సీహెచ్ వెంకన్న, సీహెచ్ నాగయ్య, కె.రామిరెడ్డి, పాల్గొన్నారు.

రూ.46లక్షలకు ఐపీ దాఖలు

ఖమ్మం లీగల్ జనవరి 30: ఖమ్మం పట్టణంలో పార్శీబంధానికి చెందిన మహ్మద్ రిజ్వాన్ 22 మందిని ప్రతివాదులుగా చూపిస్తూ మొత్తం రూ.46లక్షల 70వేలకు దివాళా పిటీషన్ దాఖలు చేశాడు. దివాళాదారుడు పాన్‌షాప్ వ్యాపారం చేసేవాడు. ఈ వ్యాపారాన్ని అభివృద్ధి చేయటంకోసం బంధువులు, స్నేహితుల దగ్గర అధిక వడ్డీలకు అప్పులు తీసుకుని ఈ వ్యాపారాన్ని అభివృద్ధి చేసినాడు. ఈ వ్యాపారం సరిగా నడవక పోవడంతో, నష్టం రావడంతో రుణ దాతలనుంచి ఒత్తిడి అధికమవటంతో గత్యంతరంలేని పరిస్థితిలో మొత్తం 22 మందిని ప్రతివాదులుగా చూపిస్తూ ఖమ్మం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో తన న్యాయవాది ద్వారా దివాళా పిటీషన్ దాఖలు చేశాడు.

రైతులపై కేసు కొట్టివేత

ఖమ్మం లీగల్ జనవరి 30: కొణిజర్ల మండలంలోని రైతులపై నమోదైన కేసును కొట్టివేస్తూ ఖమ్మం ప్రోహిబిషన్, ఎక్సైజ్ న్యాయాధికారి ఆర్.శాంతిలత మంగళవారం తీర్పుచెప్పారు. 2019 జనవరిలో కొణిజర్ల మండలంలోని రైతులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సన్నే ఉదయ్‌ప్రతాప్, జిల్లా నాయకులు బండారు నరేష్, కొల్లి సుధాకర్ ఆధ్వర్యంలో నీరులేక పంటలు ఎండిపోతుండగా ఎన్నెస్పీ కెనాల్ నీటినీ విడుదల చేయాలని కోరగా ఆనాటి ప్రభుత్వం 30 మంది రైతులపై అక్రమ కేసులను పోలీసులు నమోదుచేయగా అట్టి కేసులో పూర్వాపరాలు, సాక్ష్యాదారాలను పరిశీలించిన న్యాయాధికారి ఈ మేరకు తీర్పు చెప్పారు. నిందితుల తరుపున న్యాయవాది ఎస్.వెంకటేశ్వరగుప్తా వాదించారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి

ముదిగొండ, జనవరి 30: ట్రాక్టర్ ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన ముదిగొండ మండలం చిరుమర్రి గ్రామసమీపంలో మంగళవారం చోటుచేసు కుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. పమ్మి గ్రామానికి చెందిన బాపట్ల వీరబాబు(30)అనే యు వకుడు ద్విచక్రవాహనంపై ఖమ్మం నుంచి పమ్మి వైపు వెళ్తుండగా చిరుమర్రి గ్రామసమీపంలో ట్రాక్టర్‌ను వెనుకభాగంలో ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో వీరబాబు తలకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స కోసం ఖమ్మం తరలిస్తుండగా మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమా ర్టం నిమిత్తం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య మరియమ్మ ఫిర్యాదు మేరకు ఎస్ఐ నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాటర్‌ట్యాంక్‌పై నుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య

బూర్గంపాడు, జనవరి 30: వాటర్‌ట్యాంక్ పై నుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.... ఇల్లెందు మండలం సుదిమళ్ల గ్రామానికి చెందిన ఉకె నర్సయ్య(47) అనే వ్యక్తి ఈ నెల 29న పొలానికి వెళుతున్న అని చెప్పి ఇంటి నుంచి బయటకు వచ్చినట్లు తెలిపారు. మంగళవారం ఉదయం బూర్గంపాడు మండల పరిధిలోని తాళ్లగొమ్మూరు పంచాయతీలోని వాటర్‌ట్యాంక్ పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోషల్‌మీడియా వేదికగా సమాచారం తెలుసుకున్న మృతుడి బంధువులు బూర్గంపాడు చేరుకున్నారు. మృతుడు గత కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయినట్లు కుటుంబసభ్యులు పేర్కొన్నారు. మృతుడికి భార్య లక్ష్మీ, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

మధిర, జనవరి 30: మధిర-తొండలగోపవరం రైల్వే స్టేషన్ల మధ్య కిలోమీటరు 533/21-23 వద్ద ఎగువ లైన్‌పై వెళ్తున్న గుర్తుతెలియని రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మంగళవారం మృతిచెందాడు. ఇతని వయస్సు 40సంవత్సరాలు, ఈ వ్యక్తి ఆత్మహత్యచేసుకొని మరణించిఉంటాడని రైల్వే పోలీసులు బావిస్తున్నారు. ఇతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. అన్నం సేవా ఫౌండేషన్ అన్నం శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈమేరకు ఎస్ఐ పీ బాస్కర్‌రావు ఆధ్వర్యంలో మధిర ఆర్‌పీఎఫ్ ఇంచార్జి ఎస్ వేణుగోపాలరెడ్డి కేసునమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు. ఈవ్యక్తి ఆచూకీ ఎవరికైన తెలిసిన వెంటనే సెల్:9963641484, 8712658589 నెంబర్లను తెలియజేయాల్సిందిగా కోరారు.

చికిత్స పొందుతూ..

జూలూరుపాడు, జనవరి 30: ఎద్దు పొడవడంతో మండలంలోని దుబ్బతండా గ్రామానికి చెందిన బాణోత్ వాల్య (55) మృతి చెందాడు. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 27న వాల్య ఇంటి ఆవరణలో తన ఎడ్లకు మేత వేస్తున్న క్రమంలో ఓ ఎద్దు కాలుతో తన్ని పొడవడంతో సమీపంలో ఉన్న చిన్న కాలువలో పడ్డాడు. దీంతో అతని కాళ్ళకు, ఇతర శరీర భాగాలలో గాయాలు అయ్యాయి. కుటుంబ సభ్యులు చికిత్సలు అందించేందుకు ఆయనను కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో రెండు రోజుల పాటు చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుని భార్య బాణోత్ బుజ్జి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఇరుగు జీవన్‌రాజు తెలిపారు.

మహిళను వేధిస్తున్న వారిపై కేసు నమోదు

చింతకాని జనవరి 30: మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన నీలం కొండమ్మను వేధిస్తున్న అత్త, ఆడపడుచులు, ఆడపడుచు భర్తపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇంటి విషయంలో కొండమ్మను ఆమె అత్త సీతమ్మ, ఆడపడుచులు రంగమ్మ, వరమ్మ, నాగమ్మలతో పాటు ఆడపడుచు భర్త సీతరాములు కలసి ఆమెను వేధిస్తున్నారు. దీనితో కొండమ్మ చేసిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజేందర్ ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కిష్టారం గ్రామాభివృద్ధికి సింగరేణి పూర్తి సహకారం: జీఎం



అధికారులతో మాట్లాడుతున్న జీఎం

సత్తుపల్లి/కొత్తగూడెంటౌన్ జనవరి30: సింగరేణి ప్రభావిత ప్రాం తమైన మండలంలోని కిష్టారం గ్రామాన్ని సింగరేణి కొత్తగూడెం జీఎం షాలేమారాజు మంగళవారం అధికా రులు, ప్రజాప్రతినిధులతో కలిసి సందర్శించారు. ఇటీవల సింగరేణి అధికారులను కలిసి తమ సమస్యలను పరిష్క రించాలని గ్రామస్థులు కోరిన నేపథ్యంలో అభివృద్ధికి సింగరేణి పూర్తి సహకారం ఉం టుందని ఆయన తెలిపా రు. ప్రభుత్వ పాఠశాల, కమ్యూనిటీ హాల్, గ్రంథా లయాలను సందర్శించి మరమ్మతు పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా సైలో బంకర్ నుంచి బొగ్గు దూళి రాకుండా తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అంబేద్కర్ నగర్‌లో ఆర్‌వో ప్లాంట్, డ్రైనేజీలు, చర్చికి ఇరువైపులా రేకులషెడ్, స్కూల్ షెడ్‌కు మరమ్మత్తులు చేయించను న్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం జీవీ.కోటిరెడ్డి, జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీ పీవోలు ఎస్.వెంకటాచారి, నరసింహారావు, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ డీ.రమణా రెడ్డి, ఎస్సీ సివిల్ మదీనాపాషా, ఇతర అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

తేనెటీగల దాడిలో మహిళ మృతి



సూర్యకాంతం మృతదేహం

పినపాక, జనవరి 30: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం అమరారం పంచాయతీ పరిధిలోని కొత్తూరు గ్రామంలో మంగళవారం జరిగిన తేనెటీగల దాడిలో ఓ మహిళ మృతి చెందింది. గ్రామానికి చెందిన గొగ్గలి సూర్యకాంతం (23) తన భర్త రవీందర్‌తో కలిసి బైక్‌పై జానంపేట గ్రామానికి ఆధార్ అప్డేట్ చేయించుకునేందుకు వెళుతుండగా మార్గంమధ్యంలో తేనెటీగలు గుంపుగా వచ్చి దాడి చేయడంతో సూర్యకాంతం అపస్మారక స్థితికి వెళ్లగా, భర్త రవీందర్‌కు గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వారిని పినపాక ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యం అందించారు. మెరుగైన చికిత్స కోసం మణుగూరు 100 పడకల ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తుండగా సూర్యకాంతం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏడూళ్లబయ్యారం ఎస్ఐ వెంకటప్పయ్య తెలిపారు.

భూమి ఆధారాలు ఉంటే తెలపండి

అటవీ, సింగరేణి భూముల్లో అధికారుల సర్వే

వ్యాపారికి సంబంధించిన భూములపై నోటీసులు

ఇల్లెందుటౌన్, జనవరి 30: ఇల్లెందు పట్టణంలోని స్టేషన్‌బస్తీకి చెందిన ప్రముఖ వ్యాపారికి చెందిన భూమి వివరాలు తెలపాలంటూ మంగళవారం అటవీశాఖ, రెవెన్యూ అధికారులు నోటిసులు జారీ చేశారు. మం గళవారం తహసీల్దార్ కోట రవికుమార్, అటవీశాఖ అధి కారి నాగేశ్వరావు ఆధ్వర్యంలో పట్టణ పరిధిలోని రాజీవ్‌న గర్ వద్ద సిండికేట్ వ్యాపారి భూములు పరిశీలించారు. సుమారు 10 ఎకరాలు విస్తీర్ణంలో ఉన్న భూముల్లో కోళ్లఫారాలతో పాటు, ఇతర చర్యలు చేస్తున్నారని, భూమికి ఎటువంటి ఆధారాలు ఉన్న మూడు రోజుల్లో అందజేయాలని జారీ చేసిన నోటిసులను కోళ్లఫారాలకు అంటించారు. కాగా, ఫారెస్టు అధికారులు చర్యలు సంచలనంగా మారాయి. ప్రముఖ వ్యాపారి ఆధ్వర్యంలో కౌన్సిలర్లు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరావుపై అవిశ్వాసం పెట్టిన విషయం విదీతమే. ఈ నేపథ్యంలోనే రెవెన్యూ, అటవీశాఖ అధికారులు ఈ చర్యలకు పూనుకోవడం తీవ్ర చర్చనీయంశంగా మారింది..

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన టిప్పర్

జూలూరుపాడు, జనవరి 30: మండలంలోని వినోభానగర్ గ్రామ సమీపంలోని సీతారామ కాలువ వద్ద మంగళవారం ఆర్టీసి బస్సును టిప్పర్ ఢీకొట్టడంతో బస్సు డ్రైవర్ బ్రిలేష్‌కు గాయాలు అయ్యాయి. వివరాల్లోకి వెళ్తే మణుగూరు డిపోకు చెందిన టిఎస్ 28 టీఏ 2529 నెంబరు గల ఎయిర్ బస్సు ఖమ్మం నుంచి మణుగూరు వెళ్తుంది. ఈ క్రమంలో తల్లాడ నుంచి కొత్తగూడెం వైపు వస్తున్న టిఎస్ 29 టి 2222నెంబరు గల ట్యాంకర్ ముందు వెళ్తున్న బస్సును ఢీకొట్టింది. దీంతో బస్సు వెనుక భాగం అద్దం పగలడంతో పాటు, పాక్షికంగా దెబ్బతింది. ఈ సంఘటనలో ఆర్టీసి డ్రైవర్ బ్రిలేష్ తలకు గాయమైంది. ప్రమాదం సంబవించిన సమయంలో బస్సులో 80 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలిపారు. తృటిలో ప్రమాదం తప్పింది. సంఘటనపై ఆర్టీసి బస్సు డ్రైవర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

భద్రాచలం, జనవరి 30: భద్రాచలంలో ద్విచక్ర వాహనాల దొంగతనంకు పాల్పడుతున్న జుజ్జునూరి శ్రీను అనే వ్యక్తిని మంగళవారం పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. భద్రాచలంలో రెండు వేర్వేరు ప్రాంతాల్లో బైక్ దొంగతనాలకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో పోలీసులు శ్రీనును అరెస్టు చేయడంతో పాటు రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో సర్పంచ్‌కు తీవ్ర గాయాలు

అశ్వారావుపేట రూరల్, జనవరి 30: రోడ్డు ప్రమాదంలో సర్పంచ్‌కి తీవ్రగాయాలైన సంఘటన మండలంలో మంగళవారం సాయంత్రం జరిగింది. వివరాల్లోకి వెళితే మండలంలోని తిరుమలకుంట సర్పంచ్ సున్నం సరస్వతి స్థానిక మండల పరిషత్‌లో జరిగిన సర్పంచుల సన్మాన కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమం అనంతరం భర్త రామలక్ష్మయ్యతో కలిసి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతుండగా ఊట్లపల్లి సమీపంలో వాహనంపై నుంచి ఒక్కసారిగా పడిపోయారు. దీంతో సర్పంచి సరస్వతి తలకు, ఇతర శరీర భాగాలకు తీవ్రంగా గాయాలు అయ్యాయి. అశ్వారావుపేటలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మం తరలించారు.

పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యాయత్నం

పినపాక, జనవరి 30: మండలంలోని భూపతిరావుపేట గ్రామానికి చెందిన ఓ యువకుడు మంగళవారం పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు ఏడూళ్లబయ్యారం గ్రామంలో ఓ బ్యాంకులో ప్రైవేట్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా ఆ యువకుడు రామానుజవరం వద్ద పురుగుల మందు సేవించగా, గమనించిన కొందరు 108 కు సమాచారం అందించారని, మణుగూరులోని 100 పడకల ఆసుపత్రిలో వైద్య సేవలు అందిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. అయితే ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు.

యూట్యూబ్ విలేకరిపై కేసు నమోదు

పాల్వంచ, జనవరి 30: పాల్వంచ పట్టణ పోలీసులు మంగళవారం ఓ యూట్యూబ్ విలేఖరిపై కేసు నమోదు చేశారు. బొల్లోరిగూడేనికి చెందిన తిరుమల కొండ దుర్గాప్రసాద్ తనకున్న ట్రాక్టర్‌తో చిన్నా చితకా ట్రిప్పులు వేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే ఓ యూట్యూబ్ విలేఖరి ఈ మధ్య కాలంలో దుర్గాప్రసాద్‌ను తరచూ వేదించసాగాడు. పాల్వంచలోని ప్రతి ట్రాక్టర్ యజమాని మామూళ్ళు ఇస్తాడని, అతనిని కూడా ఇవ్వమని బెదిరించసాగాడు. మామూళ్లు ఇవ్వకపోతే ట్రాక్టర్‌ను తిరగనివ్వనని హెచ్చరించాడు. అనంతరం సోమవారం రాత్రి దమ్మపేట సెంటర్‌లో దుర్గాప్రసాద్‌ను దుర్భాషలాడి వాదనకు దిగాడు. అతనిని, అతని వాహనాన్ని అడ్డుకుని బెదిరించాడు. దీంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో దుర్గాప్రసాద్ పోలీసులను ఆశ్రయించాడు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ బానాల రాము తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు



సీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఐలు

ఖమ్మం క్రైం, జనవరి 30: బదిలీపై వచ్చిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు మంగళవారం ఎస్‌హెచ్‌వోలుగా పలువురు బాధ్యతలు స్వీకరించారు. ఖమ్మం వన్‌టౌన్ సీఐగా ఉదయ్‌కుమార్, ఖమ్మం టూటౌన్ సీఐగా బాలకృష్ణ, ఖమ్మం త్రీటౌన్ సీఐగా రమేష్, ఖానాపురంహవేలి పోలీస్‌స్టేషన్ సీఐగా భనుప్రకాష్, సత్తుపల్లి సీఐగా కిరణ్, సీసీఎస్ సీఐ గా సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌ని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన సీఐలకు పోలీస్ కమిషనర్ పలు సూచనలు చేశారు.

ఇరు జిల్లాల్లో 53 కిలోల గంజాయి పట్టివేత





అశ్వారావుపేట, కొణిజర్లలో పోలీసులకు గంజాయితో పట్టుపడిన నిందితులు

అశ్వారావుపేట/భద్రాచలం/కొణిజర్ల, జనవరి 30: అశ్వారావుపేటలో ఆర్టీసీ బస్సులో తరలిస్తున్న గంజాయిని ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. ఎక్సైజ్ అధికారులు స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మంగళవారం ఉదయం అశ్వారావుపేట ఎక్సైజ్ సీఐ నాగయ్య నేతృత్వంలో అశ్వారావుపేట, సత్తుపల్లి ప్రత్యేక బృందాలు ఏపీ-తెలంగాణ సరిహద్దు చెక్‌పోస్టువద్ద తనిఖీలు చేపట్టారు. అందులో భాగంగా ఓ ఆర్టీసీ బస్సును తనిఖీ కోసం నిలిపేయగా కొందరు అనుమానితులు బస్సు దిగి పారిపోయేందుకు ప్రయత్నించగా అప్రమత్తమైన ఎక్సైజ్ అధికారులు వారిని పట్టుకొని బస్సులో తనిఖీ చేయడంతో ఓ లగేజీ బ్యాగ్‌లో 38కిలోల గంజాయి ప్యాకెట్లు లభించాయి. దాంతో వాటిని స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన నిందితులు వరంగల్ జిల్లా నర్సంపేట మండలం, రాజేపల్లి గ్రా మానికి చెందిన ముంతోజు స్వరూప, దారా బాబు, కోదారి నిర్మల, ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం, పిండిప్రోలుకు చెందిన చామకూరి మాధవీలుగా గుర్తించారు. ఎక్సైజ్ సీఐ నాగయ్య ఈ ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నిందితులు ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో గంజాయిని కొనుగోలు చేసి కాకినాడ నుంచి సిరిసిల్ల వెళుతున్న ఆర్టీసీ బస్సు ఎక్కారు. ఖమ్మంలో బస్సు దిగి అక్కడ నుంచి రైలులో హైదరాబాదుకు చేరుకొని అక్కడ విక్రయదారులకు గంజాయిని అప్పగించాలని నిందితులు పథకం వేసినట్లు సీఐ తెలిపారు. ఈ క్రమంలోనే అశ్వారావుపేటలో జరిగిన తనిఖీల్లో 38 కిలోల గంజాయితో సహా నిందితులు పట్టుబడినట్టు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి, గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు శ్రీహరిరావు, వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

కొణిజర్లలో 13 కిలోలు..

కొణిజర్ల: తనిఖీల్లో భాగంగా ఇద్దరు వ్యక్తులు నుంచి 13కేజీల ఎండుగంజాయిని పట్టుకున్న సంఘటన మండల పరిధిలోని కొణిజర్ల సమీపంలో మంగళవారం జరిగింది. ఎక్సైజ్ అధికారులు తెలిపిన వివరాలు ప్రకారం కొణిజర్ల సమీపంలో తనిఖీలు నిర్వహిస్తుండగా హైదరాబాద్ ప్రాంతానికి చెందిన ఆకాశ్‌సింగ్, రూపేశ్‌సింగ్ నుంచి సుమారు మూడు లక్షలు విలువ చేసే 13 కేజీల ఎండుగంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ అధికారులు రమ్య, కిరీటి, మమత తదితరులు పాల్గొన్నారు.

ఎండు గంజాయి పట్టివేత

భద్రాచలం: భద్రాచలంలోని చెక్‌పోస్టు వద్ద మంగళవారం ఒడిశా నుంచి గంజాయిని కొనుగోలు చేసి ద్విచక్ర వాహనంపై తీసుకెళ్తున్న ఖమ్మంకు చెందిన అద్దంకి పవన్ అనే వ్యక్తిని ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది అరెస్టు చేశారు. ఈ సమయంలో నిందితుడి వద్ద నుంచి 2.6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు గంజాయి తరలింపునకు ఉపయోగిస్తున్న ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో సీఐ సర్వేశ్వరరావు, సిబ్బంది కరీం, హరీష్, వెంకట్, సుదీర్, హన్మంతరావు పాల్గొన్నారు.

నెల్లూరులో చింతకాని మండల వాసి మృతి

చింతకాని జనవరి 30: నెల్లూరు జిల్లా సూళ్లూరిపేటలో చింతకాని మండలం పొద్దుటూరు గ్రామానికి చెందిన వ్యక్తి రైలు కింద పడి మృతిచెందాడు. మృతుడు మోతరపు మధుసూధన్‌రావు (53) తమిళనాడు రాష్ట్రం చెన్నై నగరానికి వైద్య పరీక్షల నిమిత్తం రైలులో వెళ్తూ మార్గమధ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లా సూళ్లూరుపేట రైల్వే స్టేషన్‌లో తెల్లవారుజామున మంచినీటి కోసం రైలు దిగి ఎక్కుతున్న సమయంలో నిద్రమత్తులో కాలుజారి కదులుతున్న రైలుకిందపడిపోయాడు. దీంతో అక్కడికక్కడే మధుసూధన్‌రావు మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. చెన్నై నగరం రైల్వే పోలీసులు (సూళ్లూరిపేట పరిధి) కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

ఎలుగుబంటి దాడిలో మరొకరికి గాయాలు

- రెండు రోజుల్లో ఇద్దరిపై దాడి
- ఆందోళనలో గ్రామస్థులు

చంద్రుగొండ, జనవరి 30: ఎలుగుబంటి వరస దాడులతో చంద్రుగొండ చుట్టపక్కల గ్రామాల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. సోమవారం మద్దుకూరు ప్రాజెక్టువద్ద రామారావు అనే వ్యక్తిపై దాడి చేయగా మంగళవారం ఉదయం చంద్రుగొండ అంబేద్కర్ కాలనీలో కంచర్ల తిరుపతి ఇంటికే వచ్చింది. అప్పుడే నిద్రలేసి బయటకు వచ్చిన తిరుపతిపై ఎలుగుబంటి దాడి చేసింది. తిరుపతి కేకలు వేయటంతో ఎలుగుబంటి పారిపోయింది. ఈ దాడిలో తిరుపతి కాలుకు తీవ్రగాయాలైయాయి. మద్దుకూరు ఘటనతో అప్రమత్తంగా ఉన్న అటవీ అధికారులకు మరో సంఘటనతో అడవిని జల్లడపడుతున్నారు.



చికిత్స పొందుతున్న తిరుపతి

ఎలుగుబంటికోసం నాలుగు బృందాలు..

అడవుల నుంచి బయటకు వచ్చిన ఎలుగుబంటిని పట్టుకునేందుకు నాలుగు టీంలను ఏర్పాటు చేసినట్లు భద్రాద్రి కొత్తగూడెం ఎఫ్‌డీవో కోటేశ్వరావు తెలిపారు. ఎలుగుబంటి దాడుల నేపథ్యంలో ఎఫ్‌డీవో మంగళవారం చంద్రుగొండలో సమావేశం అయ్యారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎలుగుబంటి జాడ తెలిసే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలుగుబంటి దాడిలో గాయపడ్డ వారికి వైద్య ఖర్చులకు రూ.10 వేలు అందిస్తామన్నారు. అనంతరం మరో 90 వేలవరకు మంజూరు చేయటం జరుగుతుందని తెలిపారు.

వైరాకు మళ్లీ వివాదాస్పద అధికారి?

» 2022లో కౌన్సిలర్ల తిరుగుబాటు » కలెక్టర్ ఆదేశాలతో అప్పట్లో సెలవులోకి
» ఆయన రాక కోసం కీలక ప్రజాప్రతినిధి నుంచి లేఖ ఇప్పించిన కొంతమంది నాయకులు
» పావులు కదిపిన లైసెన్స్‌డ్ సర్వేయర్ » ఒకట్రెండు రోజుల్లో ఉత్తర్వులు వచ్చే అవకాశం

వైరా, జనవరి 30: రెండేళ్ల కిందట అనేక వివాదాల మధ్య ప్రస్తుత జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశాలతో వైరా మునిసిపల్ కమిషనర్ బాధ్యతల నుంచి తప్పుకొని వెళ్లిపోయిన అధికారి మళ్లీ వైరాకు రావడానికి రంగం సిద్ధమైందని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఒకట్రెండురోజుల్లో ప్రభుత్వం నుంచి వైరా మునిసిపల్ కమిషనర్‌గా ఆ అధికారి ఆదేశాలు తీసుకోనున్నట్లు ప్రచారం జరుగుతోంది.


వైరా మునిసిపల్ కార్యాలయం

ఒకట్రెండు రోజుల్లో ఉత్తర్వులు

ప్రస్తుతం నర్సంపేట మునిసిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న వెంకటస్వామి వైరాకు రావడానికి అత్యంత ఆసక్తిని చూపుతున్నారని చర్చ నడుస్తోంది. ఇప్పటికే వైరా మునిసిపల్ పాలకవర్గానికి చెందిన కీలకమైన వ్యక్తులు నియోజకవర్గ ప్రజాప్రతినిధి నుంచి వెంకటస్వామి రాక కోసం ఒక లేఖ కూడా ఇప్పించారని సమాచారం. రాష్ట్ర పురపాలకశాఖ అధికారుల నుంచి ఒకట్రెండు రోజుల్లో వెంకటస్వామి పోస్టింగ్ ఉత్తర్వులు వచ్చే అవకాశముందని తెలిసింది. 2018లో ఏర్పడిన వైరా మునిసిపాలిటీకి ఇంతవరకు కమిషనర్ పోస్టు లేదు. ఇప్పటివరకు ఖమ్మం కార్పొరేషన్‌కు చెందిన అధికారులు, వైరా తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మునిసిపాలిటీలోని అర్హత లేదని ఇద్దరు ఏఈలు ఇన్‌చార్జ్ కమిషనర్లుగా పనిచేశారు. అలాగే పలు మునిసి పాలిటీల్లో రెగ్యులర్ కమిషనర్‌గా ఉన్న ఇద్దరు అధికారులు కూడా ఇక్కడ కమిషనర్లుగా పనిచేశారు.

వివాదాల నేపథ్యం

మణుగూరు మునిసిపల్ కమిషనర్‌గా జి.వెంకటస్వామి 2021 ఫిబ్రవరిలో వైరా మునిసిపల్ కమిషనర్‌గా బదిలీపై వచ్చారు. 2022 జనవరిలో ఆయనపై మెజార్టీ కౌన్సిలర్లు తిరుగుబాటు చేశారు. వెంకటస్వామిపై అనేక అవినీతి ఆరోపణలు చేస్తూ కలెక్టర్ గౌతమ్‌కు, పురపాలకశాఖ రాష్ట్ర ఉన్నతాధికారులకు, అప్పటి ఎమ్మెల్యే రాములునాయక్, పుర పాలకశాఖ మంత్రి కేటీఆర్‌కు ఫిర్యాదు చేశారు. వెంకటస్వామి మునిసిపల్ కమిషనర్‌గా ఉన్నంతకాలం తాము బడ్జెట్ ఆమోదించబోమని కూడా కౌన్సిల ర్లు నిర్ణయించారు. వెంకటస్వామి బదిలీ కోసం అప్పటి ఎమ్మెల్యేపై తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చారు. దాంతో వెంకటస్వామిని 2022 ఫిబ్రవరిలో తిరిగి మళ్లీ మణుగూరుకు బదిలీ చేశారు. అయితే ఆయన మణుగూరు వెళ్లి ముందస్తు సమాచారం లేకుండానే వెంకటస్వామి బాధ్యతలు స్వీకరించిన సందర్భంలో జరిగిన పరిణామాల నేపథ్యంలో వెంకటస్వామి తీరుపై కలెక్టర్ గౌతమ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే సెలవులో వెళ్లాలని ఆదేశించారు. వెంకటస్వామి హయాంలో వైరా మునిసిపాలిటీలో అనేకమంది వృద్ధాప్య, వితంతు, వికలాంగ పింఛన్ల కోసం చేసిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేయకుండా కార్యాలయం బయట పడవేసి కాల్చివేశారనే విమర్శలు కూడా ఉన్నాయి. వివిధ అనుమతుల ఫైళ్లను కూడా ఇక్కడి నుంచి తప్పించారనే ఆరోపణలూ ఉన్నాయి. కలెక్టర్ ఆదేశాలతో సెలవుపై వెళ్లిన వెంకటస్వామి తిరిగి వైరా రాలేదు.

సమర్థిస్తున్న కీలక ప్రజాప్రతినిధి

2022 ఫిబ్రవరిలో జరిగిన వివాదాల సమయంలో కూడా ఈ పాలకవర్గంలోని కీలక ప్రజాప్రతినిధి వెంకటస్వామిని అంతగా వ్యతిరేకించ లేదు. అయితే ఇప్పుడు పాలకవర్గంలోని కీలక ప్రజాప్రతినిధితోపాటు అప్పుడు ఆయనను తీవ్రంగా వ్యతిరేకించిన కౌన్సిలర్లు మారిన రాజకీయాల నేపథ్యంలో కాంగ్రెస్‌లో చేరి ఇప్పుడు వెంకటస్వామి రాకను సమర్థిస్తుండటం విశేషం. మొత్తంగా వివాదాల వెంకటస్వామి వైరా కమిషనర్‌గా రాబోతుం డటం గమనార్హం. ఆయన పదవీకాలం కొన్నినెలలు మాత్రమే ఉందని తెలి సింది. ఆయన రాకకోసం వైరాలోని ఒక లైసెన్స్‌డ్ సర్వేయర్ కూడా తనవం తుగా పావులు కదిపారని ప్రచారం జరుగుతోంది.

వాటర్‌ట్యాంక్‌పైకి ఎక్కి సెల్ఫీలు

ఖమ్మంకార్పొరేషన్, జనవరి 30: యువత సాహసాలు చేయాలి కాని ఇటువంటివా? అని అక్కడి పరిస్థితులు చూసినవారు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇంతకు విషయం ఏంటంటే నగరంలోని 50వ డివిజన్‌లో ఒక ఫంక్షన్‌హాల్ సమీపంలో నగరపాలకసంస్థకు చెందిన భారీ వాటర్‌ట్యాంక్ ఉంది. ఈ వాటర్‌ట్యాంక్ పై భాగాన ఎటువంటి రక్షణ చర్యలు లేవు. ప్రమాదకరంగా ఉంటుంది. అయితే సదరు వాటర్ ట్యాంక్ పైకెక్కి. కొందరు యువ తీ,యువకులు సెల్ఫీలు దిగటం, చివర నిల్చొని ఫొటోలు దిగుతున్నారు. కొంచెం బ్యాలెన్స్ తప్పినా ఎత్తు నుంచి కిందపడటమే. ట్యాంక్‌బండ్ వద్దో, పార్కుల్లోనే సెల్ఫీలు దిగితే బాగుంటుంది కానీ, ఇలా ప్రమాదకరంగా ఉన్న వాటర్ ట్యాంక్‌పై ఎక్కి. సెల్ఫీలు ఏమిటని ప్రజలు వ్యాఖ్యాని స్తున్నారు.


ట్యాంకు మీద సెల్ఫీలు దిగుతుతున్న యువత

కనీస మరమ్మతులు కరువాయే

» గతేడాది వర్షాలకు రోడ్లన్నీ ధ్వంసం » ఇబ్బంది పడుతున్న అశ్వారావుపేట ప్రజలు



వంతెనకు ఒక వైపున పూర్తిగా కొట్టుకుపోయిన రోడ్డు, రోడ్డు పక్కన ఏర్పడిన గొయ్యి

అశ్వారావుపేట రూరల్, జనవరి 30: మండలంలో డిసెంబర్ మొదటి వారంలో అతిభారీగా వచ్చిన తుఫాన్‌తో మండలంలోని నారంవారిగూడెం నుంచి అచ్యుతాపురం వెళ్లే మార్గంలో ఉన్న వంతెనకు ఇరువైపులా రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. ఉధృతంగా ప్రవహించిన వాగు వలన ఒక వైపు రోడ్డు దాదాపు పది మీటర్ల మేర కోతకు గురైంది. రోడ్డుసగ భాగం వరకు దెబ్బతిన్నది. వంతెనకు మరో వైపు పెద్ద గొయ్యి ఏర్పడింది. వరదలు వచ్చి రెండు నెలలు కావస్తున్నా ఇక్కడ కనీస మరమ్మతులు చేయలేద. అధికారులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు కూడా వచ్చి దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించి తక్షణమే మరమ్మతులు చేస్తామని తెలిపారు. కాని ఇంతవరకు ఇక్కడ చిన్న పని కూడా చేపట్టలేదు. ఈదారి గుండా నిత్యం అనేక గ్రామాల ప్రజలుప్రయాణాలు సాగిస్తుంటారు. వంతెన వద్ద రహదారి దెబ్బతినటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో రోడ్డు పక్కకు వెళ్లి గోతిలో పడి గాయాలపాలవుతున్నారు. అత్యంత ప్రమాదకరంగా మారిన వంతెన వద్ద పరిస్థితిని చూసి అధికారులు, పాలకులు వదిలేస్తున్నారనే తప్ప పెద్దగా పట్టించుకోవటం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే వంతెనకు ఇరువైపులా దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రారంభానికి ముందే పగుళ్లు

రూ.40లక్షల వ్యయంతో నేలకొండపల్లి ఎక్సైజ్ కార్యాలయ నిర్మాణం
పోలీస్ హౌసింగ్ బోర్డు అధికారుల అరకొర పర్యవేక్షణ
కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం.. గోడలకు క్యూరింగ్ కూడా చేయని వైనం
కాంట్రాక్టర్‌పై కేసు పెడతాం: ఆంధ్రజ్యోతితో డీఈఈ



ప్రారంభానికి ముందే కార్యాలయంలో గోడలకు పగుళ్లు

నేలకొండపల్లి, జనవరి26: నేలకొండపల్లిలో అద్దె భవనంలో కొనసాగుతున్న ఎక్సైజ్ కార్యాలయానికి నూతన భవనం నిర్మించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం దాదాపు రూ.40 లక్షలను మంజూరు చేసింది. డిగ్రీ కళాశాల స మీపంలో స్థలాన్ని కేటాయించింది. నిర్మాణ బాధ్యతలను పోలీస్ హౌసింగ్ బోర్డుకు అప్పగించింది. నిర్మాణాన్ని నేలకొండపల్లికే చెందిన ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించింది. ఇంత వరకు బాగానే ఉంది. అసలు కథ ఇక్కడి నుంచే ప్రారంభమైంది. ఎక్సైజ్ కార్యాలయం నిర్మాణం ప్రారంభించిన దగ్గర నుంచీ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. అడపాదడపా వచ్చి చూడటం తప్ప నిర్మాణ పనులను పట్టించుకున్న నాథుడే లేడు. దీంతో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. భవన నిర్మాణ సమయంలో అసలు క్యూరింగ్ చేయలేదనే ఆరోపణలున్నాయి. భవనం మొత్తం ఎక్కడ చూసినా పగుళ్ళే. గోడలకు పగుళ్లు లేకుండా ఒక్క గది కూడా లేదంటే అతిశయోక్తి కాదేమో. ఇటీవలనే ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎక్సైజ్ కార్యాలయాన్ని పరిశీలించారు. తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నాసిరకం నిర్మాణంపై కలెక్టర్ దృష్టికి తీసుకెళతానన్నారు.

కాంట్రాక్టర్‌పై కేసు పెడతాం: అజ్మీరా రాందాస్, డీఈఈ

పోలీస్ హౌసింగ్ డీఈఈ రాందాస్‌ను ఆంధ్రజ్యోతి ఫోన్‌లో ఎక్సైజ్ కార్యాలయం నిర్మాణానికి సంబంధించిన వివరాలు అడగ్గా...ఎక్సైజ్ కా ర్యాలయ నిర్మాణం నాసిరకంగా ఉన్నది వాస్తవమేనన్నారు. కానీ పనులను పర్యవేక్షించినది తాను కాదని, నాకంటే ముందున్న డీఈఈ అన్నారు. భవనం నిర్మించిన కాంట్రాక్టర్‌కు ఇంకా బిల్లులివ్వలేదన్నారు. కాంట్రాక్టర్ ప్రవర్తన సైతం సరిగా లేదన్నారు. నాసిరకం నిర్మాణానికి సంబంధించి కాంట్రాక్టర్‌పై కేసు పెడతామని డీఈఈ పేర్కొన్నారు.

మహనీయుల ఆదర్శాలు స్ఫూర్తిదాయకం

గాంధీ వర్ధంతిలో ఇరు జిల్లాల కలెక్టర్లు గౌతమ్, ప్రియాంక

ఖమ్మం కలెక్టరేట్/ కొత్తగూడెం కలెక్టరేట్, జనవరి 30: స్వాతంత్ర్య సమరయోధుల పోరాటాలను, ప్రాణ త్యాగాలను స్మరించుకుని, వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రజలకు సేవలు అందించాలని ఇరు జిల్లాల కలెక్టర్లు గౌతమ్, ప్రియాంక అల అన్నారు. మంగళవారం కొత్తగూడెం, ఖమ్మం జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్లలో జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని నిర్వహించారు. ముందుగా ఖమ్మంలో కలెక్టర్ గౌతమ్ పోలీస్ కమిషనర్ సునీల్ దత్, జిల్లా అధికారులతో కలిసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అంతకుముందు కలెక్టర్, పోలీస్ కమిషనర్‌లు మహాత్మా గాంధీ చిత్ర పటానికి పూలవేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యంలో మహాత్మా గాంధీ ప్రత్యేక పాత్ర పోషించారని, గాంధీజీ స్వేచ్ఛ కోసం సత్యం, అహింస మార్గాన్ని ఎంచుకొని పలు ఉద్యమాలు చేశారన్నారు. కార్యక్రమంలో ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ పాల్గొన్నారు. కొత్తగూడెంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ప్రియాంక మాట్లాడుతూ దేశ కోసం జరిగిన స్వాతంత్ర్య సంగ్రామంలో ఎందరో ప్రాణాలు త్యాగం చేశారని కొనియాడారు. త్యాగమూర్తుల జ్ఞాపకార్థం జాతిపిత గాంధీ వర్ధంతి జనవరి 30న అమరవీరుల దినోత్సవంగా జరుపుకుంటున్నామని అన్నారు. స్వాతంత్ర్య సమర యోధుల పోరాటాలను, ప్రాణ త్యాగాల స్ఫూర్తిని కొనసాగించడం మన బాధ్యత అన్నారు. స్వాతంత్ర్య సాధనలో మహాత్మా గాంధీ ప్రత్యేక పాత్ర పోషించారని తెలిపారు. ఆయన ఆశయ సాధనకు అందరం కృషి చేయాలని ఆమె సూచించారు. అదనపు కలెక్టర్లు రాంబాబు, మధుసూదన్ రాజు, డీఆర్వో రవీంద్రనాద్, డీజీవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


గాంధీ వర్ధంతి సందర్భంగా మౌనం పాటిస్తున్న కలెక్టర్, సీపీ


కొత్తగూడెం కలెక్టరేట్‌లో మౌనం పాటిస్తున్న కలెక్టర్, అధికారులు

గడువు ముగిసింది.. చెరకు మిగిలింది

క్రషింగ్ చేపట్టాలని బాధిత రైతుల విన్నపం
కాకతీయ ఫ్యాక్టరీకి వచ్చి యాజమాన్యంతో మొర
రైతులకు న్యాయం చేస్తాం: ప్లాంట్ మేనేజర్

కల్లూరు, జనవరి 31: అనేక కష్టాలకు ఓర్చి వారు చెరకును పండించారు. చెరకు అన్ని పంటల్లా కాదు. కాకతీయ కర్మాగారం క్రషింగ్ ప్రారంభిస్తేనే తోటలను నరకాల్సి ఉంటుంది. ఈ ఏడాది క్రషింగ్‌లో జాప్యం ఏర్పడటంతో అన్నదాతల ఆవేదన మామలుగా లేదు. ఓ వైపు చెరకు గడల్లో రసం ఇంకిపోతోంది. ఇలా ఇంకిపోతే తూకం రాదు. తూకం రాకుంటే రైతులకు గిట్టుబాటు కాదు. ఎండుతున్న ఆ చెరకు తోటలను చూసి రైతులు కన్నీటి పర్యం తమవుతున్నారు. కల్లూరు మండలంలోని లక్ష్మీపురం పరిధి లో క్రషింగ్ జరపని చెరకు భారీగానే ఉంది. ఇతర ఫ్యాక్టరీ లకు సకాలంలో క్రషింగ్‌కు త రలించి తమ న్యాయం చేయా లని మంగళవారం పలువురు రైతులు కాక తీయ యాజమాన్యానికి మొరపెట్టుకున్నారు. కాకతీయ ఫ్యాక్టరీకి తరలి వచ్చి తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ సందర్భం గా లక్ష్మీపురానికి చెందిన మం దపాటి మాధవరెడ్డి, వల సా ల మురళి, రాంబాబు, వెంకటేశ్వరరావు తదిత రులు విలేకరులతో మాట్లాడారు. ఈ ఏడాది క్రషింగ్ సీజన్‌కు గానూ లక్ష్మీపురంలో 70 ఎకరాల చెరకు తోటలకు సంబంధించి క్రషింగ్ జరిపేందు కు కాకతీయ యాజమాన్యం తమతో ఒప్పందం కుదుర్చు కుందని చెప్పారు. అం దుకు భిన్నంగా ఫ్యాక్టరీ యాజ మాన్యం క్రషింగ్ సీజన్‌లో తోటల్లో సిద్ధం గా ఉన్న చెరకును కూలీలతో నరకించటం, పలు కారణా ల నేపథ్యంలో జాప్యం చేసిందని ఆరోపించారు. ఇలా మిగిలి ఉన్న చెరకుకు నష్టం జరగకుండా ఇతర ఫ్యాక్టరీలకు తరలించి మద్దతు ధర వచ్చేలా రైతులకు న్యాయం చే యాలని వారు వేడు కుంటున్నారు. ఇప్పటికే తోటల్లో ఉన్న చెరకు నరక కుండా ఫ్యాక్టరీకి తరలించకపో వటంతో అన్ని విధాలుగా నష్ట పోవాల్సి వస్తోందన్నారు. కాకతీయ యాజమాన్యం తమతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం రవాణా భారం భరించి ఆదుకోవాలని పలువురు రైతులు యాజ మాన్యానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీలోని కేన్‌డవలప్ మెంట్ అధికారికి, ప్లాంట్ ఇంజనీర్ రఘునాథబాబుకు తమ సమస్యలను వివరించారు. న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చెరుకు రైతులు వాకదాని వెంకటేశ్వర్లు, అజ్మీర మంగ్యా పాల్గొన్నారు.


లక్ష్మీపురంలో తోటల్లో ఎండిపోతున్న చెరకును చూపిస్తున్న రైతులు

రైతులకు న్యాయం చేస్తాం
రఘునాథబాబు, ప్లాంట్ ఇంజనీర్

లక్ష్మీపురంలో క్రషింగ్ గడువులోగా తోటల్లో నరకకుండా మిగిలి ఉన్న చెరకును ఇతర ఫ్యాక్టరీకి తరలిస్తాం. బాధిత రైతులకు న్యాయం చేస్తాం. రైతులు నష్ట పోకుండా మద్దతు ధర కల్పిస్తామని వివరించారు.

ముగిసిన భౌతికశాస్త్ర జాతీయ సదస్సు

ఖమ్మం ఖానాపురంహవేలి జనవరి 30: నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల రెండు రోజులుగా నిర్వహిస్తున్న భౌతికశాస్త్ర జాతీయ సదస్సు మంగళవారంతో ముగిసింది. కళాశాల భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో రీ సెంట్ అడ్వాన్సెస్ ఇన్ మెటీరియల్ సైన్స్ రీసెర్చ్ అనే అం శంపై రెండు రోజుల జాతీయ సదస్సును మొత్తం నాలుగు సెషన్స్‌లో నిర్వహించారు. మొదటి సెషన్‌లో ఇద్దరు ఎన్ఐటీ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వరంగల్ నుంచి హాజరైన డాక్టర్ ప్రొఫెసర్ డాక్టర్. దినకర్ దంతాల, డాక్టర్ డి. హరినాథ్ కీలకోపన్యాసాలు చేశారు. రెండో సెషన్‌లో డాక్టర్ డి. పాల్ జోసెఫ్, డాక్టర్. కే. ప్రభాకర్ రావు వివిధ అంశాలపై మాట్లాడారు. మంగళవారం ఉదయం సెషన్స్‌లో పూర్ణ ప్రజ్ఞ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైంటిఫిక్ రీసెర్చ్ బెంగళూరు ప్రొఫెసర్ డాక్టర్ నరేష్ నలజాల ఆన్లైన్లో తమ పరిశో ధనా పత్రాన్ని సమర్పించారు. ప్రతి సెషన్స్‌లో రిసోర్స్‌పర్సన్స్‌ల ప్రసంగాల మధ్య వివిధ డిగ్రీ కళాశాల నుంచి వచ్చిన అధ్యాపకులు, పీజీ, డిగ్రీ విద్యార్థులు తమ తమ పరిశోధనా పత్రాలను సమర్పించారు. ము గింపు సమావేశానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. జి. ప ద్మావతి అధ్యక్షత వహిం చగా ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళా శాల ప్రిన్సిపల్ డాక్టర్. జకీరుల్లా ముఖ్యఅ తిథిగా, ప్రత్యేక అతిథిగా రిటైర్డ్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బి.దర్శన్ విశిష్ట అతిథిగా పాల్గొ న్నారు. ముగింపు సమావే సమావే శంలో పరిశోధనా పత్రాలను సమర్పించిన అధ్యాపకులకు, విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. సెమినార్ కన్వీనర్‌గా ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.


ముగింపు కార్యక్రమంలో ప్రసంగిస్తున్న జకీరుల్లా

ఎస్‌బీఐటీలో ప్రాంగణ నియామకాలు..
టెక్ మహీంద్రాకు 43 మంది విద్యార్థుల ఎంపిక

ఖమ్మం ఖానాపురంహవేలి జనవరి 30: ప్రముఖ బహుళజాతి కంపెనీ టెక్ మహేంద్ర ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని ఎస్‌బీఐటీ ఇంజ నీరింగ్ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ నియామకాలలో 43 మంది విద్యార్థులు సర్వీ డెస్క్, టెక్నీషియన్ ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. వీరికి సంవత్సరానికి 3 లక్షల రూపాయల వేతనం లభిస్తుందని తెలిపారు. తమ కళాశాల విద్యార్థులు ప్లేస్మెంట్లు సాధించేందుకు ఇన్ఫోసిస్, ఐటీసీ అకాడమీ వంటి కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థికి విద్య తో పాటు పలు రంగాలలో తమ కళాశాలలో శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ జి. ధాత్రి మాట్లాడుతూ యాజయాన్యం విద్యార్థులపై చూపుతున్న శ్రద్ధ వల్ల రికార్డు స్థాయిలో ప్లేస్మెంట్స్ సాధిస్తున్నా రన్నారు. ప్రాంగణ నియామకానికి మొత్తం 150 మంది విద్యార్థులు హాజ రవ్వగా రెండవ దశ ఇంటర్వ్యూకు 67 మంది విద్యార్థులు ఎంపికయ్యా రని తెలిపారు. వీరిలో 43 మంది విద్యార్థులు ఉద్యోగాలకు తుది అర్హత సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రాజ్ కుమార్, టెక్ మహేంద్ర ఆర్ఎంజీ మేనేజర్ జి. డైలిస్ మార్వింగ్, హెచ్ఆర్ ఎగ్జిక్యూటివ్ ఎస్కే. ఖాసిం, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె. అమిత్ బిందాజ్, అకడమిక్ డైరెక్టర్స్, గంధం శ్రీనివాసరావు పాల్గొన్నారు

చిన్నారికి వనజీవి దంపతుల సన్మానం

ఖమ్మం రూరల్, జనవరి 30: పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా కేంద్రానికి చెందిన చిన్నారి మూడ్ విశ్వామిత్ర చౌహాన్‌ను పద్మశ్రీ పురస్కార గ్రహీత వనజీవి రామయ్య, జానమ్మ దంపతు లు మండల పరిధిలోని రెడ్డిపల్లి లోని వారి ఇంట్లో మంగళవారం సన్మా నించారు. ఈ సందర్భంగా ఇటీవల గణతంత్ర దినోత్సవం సందర్భంగా పర్యావరణ పరిరక్షణ విభాగంలో మూడ్ విశ్వామిత్ర చౌహాన్ కొత్తగూడెం కలెక్టర్ ప్రియాంక అల చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా చి న్నారిని వనజీవి దంపతులు సన్మానించారు. ఈ కార్య క్రమంలో నుర్వి రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్

సుజాతనగర్, జనవరి 30: జేఈఈ మెయిన్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని అబ్దుల్ కలామ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఐదో రోజైన మంగళవారం రెండు సెషన్స్‌లలో పరీక్షలు నిర్వహించారు. పరీక్షా కేంద్రంలోకి గంటన్నర ముందే విద్యార్థులను అనుమతించారు. సెల్ఫ్ డిక్లరేషన్ పత్రం చూపించిన విద్యార్థులను లోనికి అనుమతించారు. పరీక్షకు మొత్తం 131 మంది విద్యార్థులకు గాను 131 మంది హాజరు కాగా ఎవరూ గైర్హాజరవలేదని, రెండో సెషన్‌లో 131 మంది విద్యార్థులకు 130 మంది హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు.

ప్రొటోకాల్ పాటించరా?

స్థానిక ప్రజాప్రతినిధులంటే చులకనా?
అధికారులపై జడ్పీ చైర్మన్ కమల్‌రాజ్ ఆగ్రహం
సాదాసీదాగా ఖమ్మం స్థాయీ సంఘాల సమావేశం

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 30: 'అధికారులకు స్థానిక ప్రజాప్రతినిధులు అంటే లెక్కలేకుండా పోతోంది... ప్రొటోకాల్ పాటించాలని తెలీదా. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన పల్లెదవాఖానాల ప్రారంభోత్సవానికి జడ్పీ చైర్మన్‌గా నన్నే పిలవరా... దీనిపై నోటీసులు ఇవ్వండి' అంటూ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో చైర్మన్ లింగాల కమల్‌రాజ్ అధ్యక్ష తన జడ్పీ స్థాయీ సంఘాల సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా 4వ స్థాయీ సంఘం విద్య- వైద్యంపై చర్చ సందర్భంగా జిల్లా వైద్యాధికారి సమావేశానికి హాజరుకాకపోవడం పట్ల చైర్మన్ ప్రశ్నించారు. ఆ తర్వాత నివేది కలు చదివిన తర్వాత మధిరలో ఇటీవల పల్లెదవా ఖాన ప్రారంభోత్సవానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పాల్గొంటే ఆ కార్యక్రమానికి కనీసం జడ్పీ చైర్మన్ ను పిలవాలని ప్రొటోకాల్ పాటించాలని తెలిదా అన్నారు. గత ప్రభుత్వ హయాంలోనే జిల్లాలో పల్లెదవాఖానాలకు, పీహె చ్‌సీలకు నిధులు సమకూర్చిందన్నారు. వాటితో పూర్తయిన వాటినే మంత్రులు ప్రారంభిస్తున్నారని.. అలాంటిది కనీసం ప్రొటోకాల్ పాటించక పోవడం గర్హనీయమన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం, ప్రొటో కాల్ పాటించరా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి బాధ్యు లైన వారికి నోటీసులు ఇవ్వాలంటూ సీఈవోకూ ఆయన సూచించారు. ఈసందర్భంగా పలు సమస్యలను ప్రజాప్రతినిధులు ప్రస్తావించగా, సంబంధిత అధికారు లు అందుకు సమాధానాలిచ్చారు. ఆ తర్వాత సాదాసీదాగా వివిధ స్థాయీ సంఘాల సమావేశాలు జరిగాయి. కేవలం అధికారులు నివేదికలను మా త్రం చదివారు తప్ప వాటిపై అంతగా సభ్యులెవ్వరూ చర్చించకపోవడం గమనార్హం. దీనితో పాటు వివిధ శాఖలకు చెందిన రెండో శ్రేణి అధికారులు మాత్రమే ఈ సమావేశాలకు హాజరయ్యారు తప్ప జిల్లా అధికారులు చాలా తక్కువ మంది హాజరుకావడం పట్ల కూడా సభ్యులు అసహనాన్ని వ్యక్తం చేశారు. అంతకు ముందు గాంధీజీ వర్ధంతి సందర్భంగా అమరుల సంస్మ రణార్థం సభ్యులు రెండు నిమిషాల పాటు నివాళి అర్పించారు. సమావే శంలో శిక్షణ కలెక్టర్ మయాంక్ సింగ్, జడ్పీ సీఈవో వింజం వెంకట అప్పారావు, డిప్యూటీ సీఈవో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ లింగాల కమల్‌రాజ్

60 రోజుల వరి.. కంకులు వేసింది

అన్నదాతల్లో ఆందోళన.. భయపడాల్సిన పని లేదు: ఏవో

నేలకొండపల్లి, జనవరి 30: సాధారణంగా వరి 150 నుంచి 170 రోజుల్లో కోతకు వస్తుంది. సన్న రకాలైతే అది మరో పది నుంచి 20 రోజులవుతుంది. నాటు వేసిన మూడు నెలల్లో కంకులు వేయడం ప్రారంభమవుతుంది. కానీ నేలకొండపల్లిలో ఇందుకు విరుద్ధంగా ఉంది. నాటు వేసిన కేవలం 60 రోజుల్లో వరి కంకులు వేస్తోంది. అది కూడా వరి అంతంతమాత్రంగానే ఎదిగింది. వరి దుబ్బులు కూడా ఆశించినంత స్థాయిలో ఎదగలేదు. కానీ ఈ దశలోనే వరి కంకులు వేస్తుండటం అన్నదాతలను నివ్వెరపరుస్తోంది. పైగా వరి కంకులు కూడా అంతంతమాత్రంగానే ఉన్నాయి. దీంతో రైతుల్లో ఆందోళన మొదలయింది.


నాటు వేసిన 60 రోజులకే వరిలో కనిపిస్తున్న ధాన్యపు కంకులు

కాల్వలకు సాగు నీరు లేకపోవడంతో..

కాల్వలకు సాగు నీరు లేదు. ఫలితంగా మండలంలో యాసంగి వరి పంట విస్తీర్ణం పూర్తి స్థాయిలో తగ్గిపోయింది. ఈసమయంలో కొద్దో, గొ ప్పో బావులు, బోర్లున్న రైతులు వాటి కింద పొలాలను సా గు చేస్తున్నారు. ఎన్నో ఆశలతో పంటను వేసుకున్నారు. రైతులు మంచి దిగుబడినిచ్చే వరి విత్తనాలనుకుని డీలర్ల నుంచి కొనుగోలు చేసి నార్లు పోసి, నాట్లు వేసుకున్నారు. ఇంత వరకు బాగానే ఉంది. ఇంత వరకు ఎక్కడా లేని విధంగా నాటు వేసిన 60 రోజులకే వరి కంకులు రావడం మొదలై రైతులను ఆశ్చర్యానికి, ఆందోళనకు గురిచేస్తోంది. మండల పరిధిలోని బుద్ధారం, చెర్వుమాధారానికి చెందిన రైతులు నేలకొండపల్లిలోని ఓ డీలర్ వద్ద నుంచి వరి విత్తనాలను కొనుగోలు చేశారు. గత ఏడాది నవంబరులో విత్తనాలు తీసుకెళికల నారు పోసుకున్నారు. 2023 డిసెంబరు 18న నాటు వేసారు. 2024 జనవరి 20 నుంచి వరి కం కులు రావడం మొద లైంది. బుద్ధారం, చెర్వుమాధారానికి చెందిన రైతులు సదరు కంపె నీకి చెందిన విత్తన ధాన్యం సంచులు తెచ్చి, నారు పోసి, 65 ఎకరాల్లో నాటు వేశారు. వీరే గాక ఇంకా కొంత మంది రైతులు సైతం ఇవే విత్తనాలు కొనుగోలు చేసి నాట్లు వేసుకున్నారు. అయితే అందరి రైతుల పరిస్థితి దాదాపు ఇలానే ఉంది. నిర్ణీత కాలానికంటే ముందే వరి కంకులు వేస్తుండటంతో రైతులు ఆందోళనలో కూరుకుపోయారు. వరిని చూసి కన్నీటి పర్యంతమవుతున్నారు.

ఏం చేయాలో పాలు పోవటం లేదు
ఆరెకట్ల గురవయ్య, రైతు, బుద్ధారం



నాటు వేసిన నెల రోజుల్లో ధాన్యం కంకులు చూడటం ఇప్పుడే. ఏం చేయాలో తోచటం లేదు. ఇప్పటికే చాలా పెట్టుబడి పెట్టాం పంట చేతికొస్తదో, రాదో తెలియటం లేదు. ప్రభుత్వం మాకు న్యాయం చేయాలి. ఇప్పటికే వేలాది రూపాయలు పెట్టుబడులుగా పెట్టాం.

రైతులు భయపడాల్సిన అవసరం లేదు
అరుణకుమారి, ఏవో

తొందరగా పొలం ఈనిందని రైతుల భయపడాల్సిన అవసరం లేదు. రైతులు సాగు చేసిన పంట కాలం 110 రోజులే. వాతావరణ పరిస్థితులతో పాటు యూరియా ఎక్కువగా వాడటం వల్ల కూడా పంటలో ఎదుగుదల ఉండదు. రైతులు నాకు ఫిర్యాదు చేసారు. బుధ, గురు వారాల్లో కంపెనీ ప్రతినిధులు కూడా వచ్చి పొలాలను పరిశీలిస్తారు. అంతే గాకుండా శాస్త్రవేత్తలకు సమస్యను వివరించి పొలాలను పరిశీలించాలని కోరతాం.


హైస్కూల్లో అల్పాహారానికి బొర్రా ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న ఉమాదేవి

వైరా,జనవరి30: వైరా ప్రభుత్వ హైస్కూల్లోని పదోతరగతి విద్యార్థుల అల్పాహారం కోసం రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్ సతీమణి, మాజీ జడ్పీటీసీ బొర్రా ఉమాదేవి రూ.16వేలు మంగళవారం అందజేశారు. వైరా మాజీసర్పంచ్, తన మామయ్య దివంగత బొర్రా వెంకటేశ్వర్లు స్ఫూర్తితో విద్యాభివృద్ధిలో భాగంగా అల్పాహారం కోసం ఆర్థికసాయం అందజేశామని ఉమాదేవి ప్రకటించారు. భవిష్యత్‌లో కూడా తన భర్త బొర్రా రాజశేఖర్ సహకారంతో వైరాలో విద్యాభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు జి.మాధవరావు, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, రామకృష్ణ, రఫీ, నర్సింహారావు, తులసీ, సీతారామారావు, భాస్కర్‌రావు, రోజా, మేరీ, నేలవేణి, కవిత, అనితాదేవి, పద్మావతి పాల్గొన్నారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి



కార్మిక సమ్మెను విజయవంతం చేయాలి

ఖమ్మంసంక్షేమవిభాగం,జనవరి30: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలతో కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని, కార్మిక వ్యతిరేక విధానాలపై ఫిబ్రవరి 16న దేశ వ్యాప్త సమ్మెను ప్రతి కార్మికుడు విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షకార్యదర్శులు తుమ్మా విష్ణువర్దన్,కళ్యాణం వెంకటేశ్వరరావు కోరారు. మంచికంటి భవన్‌లో ఖమ్మం సీపీఎం రెండో కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. నారపోగు నాగేశ్వరరావు, వై విక్రమ్, పి రమ్య, ఉపేందర్, సుదర్శన్, రమేశ్ పాల్గొన్నారు.

యాచకులకు పండ్లు పంపిణీ

ఖమ్మంచర్చికాంపౌండ్, జనవరి30: బాలు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నగరంలోని కన్యకపరమేశ్వరి ఆలయం వద్ద మంగళవారం బిక్షాటన చేసే వారికి భోజన పొట్లాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ చెరుకుపల్లి బాలు, సభ్యులు కుక్కల ప్రవళిక, పంది వేణు, కె.సైదులు, పడిశాల వీరస్వామి, కె.కాశయ్య, గట్టికొండ చుక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ సమావేశాన్ని విజయవంతం చేయాలి

ఏన్కూరు,జనవరి30: నేలకొండపల్లిలో జరిగే టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ విస్తృత సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆసంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.లక్ష్మి, ఎన్.సుధాకర్‌రావు కోరారు. మంగళవారం ఏన్కూరులో సంఘం సమావేశంలో మాట్లాడారు.

సర్పంచ్‌ల పదవీకాలం పొడిగించాలి

ఏన్కూరు,జనవరి30: గ్రామపంచాయతీ సర్పంచ్‌ల పదవీకాలాన్నీ పొడిగించాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లానాయకులు ఎస్‌కె లాల్‌మియా ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ఏన్కూరులో మద్దెల పుల్లయ్య అధ్యక్షతన ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఈసమావేశంలో మండల నాయకులు కొండే వెంకటేశ్వర్లు, డి.శ్రీనివాసరావు,ఆనంద్, నరసింహారావు, గద్దం వెంకన్న, పుల్లమ్మ, వీరభద్రం, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం విజయవంతం

ముదిగొండ, జనవరి 30: ముదిగొండలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. ముదిగొండ పాస్టర్స్, ప్రశాంతి హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ వైద్యశిబిరాన్ని తహసీల్దార్ రామారావు ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్లు భరత్‌బాబు, శ్రీధర్‌గౌడ్, శ్రావణి, దావీదు, శామ్యూల్, జైపాల్, ఎజ్రా, ఉసికల రమేష్ పాల్గొన్నారు.

అధిక తరుగుతో రైతులకు నష్టం

ముదిగొండ, జనవరి30: అధిక తరుగు తీయడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని రైతుసంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ముదిగొండ మండలం న్యూలక్ష్మీపురం ఉషశ్రీ జిన్నింగ్‌మిల్లు వద్ద సీసీఐ అధికారులతో నాయకులు మాట్లాడారు. రైతుల వద్ద తరుగు పేరిట దోచుకుంటున్నారని వారు సీసీఐ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. సీసీఐ కొనుగోలు కేంద్రంలో తరుగు పేరిట దోచుకుంటున్నారని తెలిసినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకుడు వాసిరెడ్డి వరప్రసాద్, సీపీఎం మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, టీఎస్.కల్యాణ్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో సమస్యల పరిష్కారానికి తీర్మానం

ముదిగొండ, జనవరి 30: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని పలు సమస్యల పరిష్కారానికి కృషిచేయనున్నట్లు ఎంపీపీ సామినేని హరిప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో సమస్యల పరిష్కారానికి తీర్మానం చేశారు. ఆసుపత్రిలో మెరుగైన వైద్యసేవలందించాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో తహసీల్దార్ వై.రామారావు, ఎంపీడీవో అశోక్‌కుమార్, వైద్యాధికారిణి అరుణాదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తేజ కళాశాలలో ఘనంగా ఫేర్‌వెల్‌డే వేడుకలు

సత్తుపల్లిరూరల్, జనవరి30: సత్తుపల్లి మునిసిపాలిటీలోని తేజ ఒకేషనల్ పారా మెడికల్ కళాశాలలో మంగళవారం ఫేర్‌వెల్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాకతీయ విద్యాసంస్థల కరస్పాండెంట్ కూసంపూడి మధుసూదన్‌రావు మాట్లాడుతూ వృత్తి విద్యాకోర్సులలో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో చైర్మన్ జీవీ.రెడ్డి, డైరెక్టర్లు శ్రీనివాసరావు, ప్రవీణ్‌రెడ్డి, శ్రీధర్, ప్రిన్సిపాల్ సుబ్బారావు, ప్రభాకరరావు పాల్గొన్నారు.

అత్యాశకుపోయి మోసపోవద్దు: ఎస్‌ఐ

తల్లాడ, జనవరి30: ఆఫర్లంటూ సోషల్‌మీడియాలో వస్తున్న ప్రకటనలు చూసి యువత అత్యాశకు పోయి మోసపోవద్దని తల్లాడ ఎస్‌ఐ బి.కొండల్‌రావు కోరారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమం లో ఏఎస్‌ఐ జేవీఆర్, హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు, రాధాకృష్ణ, కృష్ణ పాల్గొన్నారు.

తిరుమలాపురం సర్పంచ్‌కు సన్మానం

చింతకాని, జనవరి30: తిరుమలాపురం సర్పంచ్ బండి రమాదేవిని అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు మంగళవారం సన్మానించారు. ఎంపీవో మల్లెల రవీంద్రప్రసాద్ మాట్లాడుతూ నూతన పంచాయతీగా ఏర్పడిన అనంతరం కార్యాలయం నిర్మాణానికి ప్రభుత్వ స్థలం లేకపోవడంతో సర్పంచ్ బండి రమాదేవి- రామారావు దంపతులు నివాసం ఉంటున్న ఇంటి స్థలాన్ని పంచాయతీ కార్యాలయ నిర్మాణానికి అప్పగించడం హర్షించదగిన విషయమన్నారు. ఉన్నత విద్యావంతురాలైన సర్పంచ్ గ్రామాభివృద్ధికి కృషి చేశారన్నారు.

హెచ్‌ఎంల సమస్యలను పరిష్కరించాలి

ఖమ్మంరూరల్,జనవరి30: ప్రధానోపాధ్యాయులు సమస్యలను పరిష్కరించాలని ప్రదానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాయల వీరస్వామి ప్రభుత్వాన్ని కోరారు. మండల పరిధిలోని జలగంనగర్ ఉన్నత పాఠశాలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రదానోపాధ్యాయుల సంఘం మండల సమావేశం మంగళవారం నిర్వహించారు.

కుష్టు వ్యాధి నివారణపై అవగాహన

కామేపల్లి, జనవరి 30: మండల పరిధిలోని గ్రామ పంచాయతీల్లో కుష్ట వ్యాధి నివారణపై వైద్యాధికారి నెల్లూరి చందన అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించారు. జిల్లా ఉన్నతధికారుల ఆదేశాల మేరకు గ్రామ మొదటి పౌరుడి సందేశం చదివి వినింపించారు. అనంతరం ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. 14రోజులపాటు కుష్టు వ్యాధిపై అవగాహన సదస్సులు ఉంటాయని మెడికల్ ఆఫీసర్ చందన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అర్జున్, హెల్త్ సూపర్‌వైజర్ రాజు పంచాయతీ కార్యదర్శి పెండ్ర అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయండి. సీఐటీయు

ఎర్రుపాలెం జనవరి30: మండల వనరులకేంద్రం కార్యాలయంలో మధ్యాహ్న భోజన కార్మికులు యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సమ్మె నోటీసును మంగళవారం అందజేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు కార్మిక వ్యవసాయ వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని సీఐటీయు మండల కార్యదర్శి సగుర్తి సంజీవరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మధ్యాహ్న భోజన కార్మిక యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు దేవకర్ణ, మేరీజ్యోతి, కమిటీ సభ్యులు దుర్గాభవాని, విజయమ్మ, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ది న్యూ ట్యాక్సీ యూనియన్ కార్యవర్గం ఎన్నిక

సత్తుపల్లిరూరల్, జనవరి30: సత్తుపల్లి బస్టాండ్ సెంటర్‌లోని ది న్యూ ట్యాక్సీ యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం జరిగింది. అధ్యక్షుడిగా బత్తిన కిషోర్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా మహేష్, కార్యదర్శిగా నందన్, జాయింట్ సెక్రటరీగా యాకోబు, ట్రెజరర్‌గా జయరాజ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మోరంపూడి పాండు, కొలికపోగు సర్వేశ్వరరరావు పాల్గొన్నారు.

గ్యాస్‌బాయ్ కుటుంబానికి రూ.45వేల సహాయం



ఆర్థికసాయం అందిస్తున్న నిర్వహకులు

సత్తుపల్లిరూరల్, జనవరి30: సత్తుపల్లిలోని శ్రీ వెంకటేశ్వర ఇండేన్ గ్యాస్ కంపనీలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్న జొన్నలగడ్డ శ్రీకాంత్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మంగళవారం ఇండేన్ గ్యాస్ నిర్వహకులు వందనపు సత్యనారాయణ, కోటగిరి సుధాకర్‌బాబులు బాధితుని కుటుంబానికి రూ.45వేల సహాయం అందజేశారు. కార్యక్రమంలో చందర్‌రావు, గ్యాస్ కంపనీ సిబ్బంది పాల్గొన్నారు.



ఖమ్మం కాంగ్రెస్ కార్యాలయంలో..



నివాళులర్పిస్తున్న వర్తకసంఘం సభ్యులు

జాతిపితకు ఘనకు నివాళి

జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని జిల్లావ్యాప్తంగా నిర్వహించారు. సత్తుపల్లిలో ఎమ్మెల్యే మట్టా రాగమయి నివాళలర్పించారు. మధిర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఖమ్మంలో స్తంభాద్రిసేవా సమితి ఆధ్వర్యంలో బియ్యాన్ని వితరణగా ఇచ్చారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయం భవనంలో ప్రధాన కార్యదర్శి మెంతుల శ్రీశైలం నివాళులర్పించారు.

: నెట్‌వర్క్



నివాళలర్పిస్తున్న ఎమ్మెల్యే రాగమయి



మధిరలో నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



వితరణ అందజేస్తున్న దృశ్యం



నేలకొండపల్లిలో..

స్టాఫ్‌నర్సు ఉద్యోగాల్లో సత్తాచాటిన జిల్లావాసులు

ఒకే దళిత కాలనీలో దంపతులకు ఉద్యోగాలు

బోనకల్, జనవరి30: స్టాఫ్‌నర్సు ప్రవేశ పరీక్షా ఫలితాల్లో ఒకే దళితకాలనీకి చెందిన ముగ్గురు ఉద్యోగాలకు ఎంపిక అయ్యారు. మండలంలోని గోవిందాపురం(ఎల్) ఎస్సీ కాలనీలో కొమ్ము నాగరాజు, శ్రీలక్ష్మీ దంపతులతో పాటు కొమ్ము గీతాంజలి ప్రవేశ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి జనరల్ కేటగిరిలోఉద్యోగాలు సాధించారు. గీతాంజలి,శ్రీలక్ష్మీ, మమత ఆసుపత్రి లో నర్సులుగా పని చేస్తున్నారు. నాగరాజు హైదరాబాద్‌లో ప్రైవేటు ఆసుపత్రిలోపని చేస్తున్నాడు.

ఆర్టీసీ కండక్టర్‌కు డీఎం అభినందన

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న గుండపునేని విజయ ఇటీవల స్టాఫ్‌నర్స్ ఉద్యోగానికి ఎంపికైంది. మంగళవారం ఆమెను డీఎం యూ. రాజ్యలక్ష్మీ మిఠాయిలు తినిపించి అభినందిం చారు. 2009నుంచి సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పని చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పీ.విజయశ్రీ, ఎంఎఫ్ సిలివేరు సాహితీ, కండక్టర్ కిన్నెర ఆనందరావు పాల్గొన్నారు.

రత్నకుమారికి భద్రాద్రిజోన్‌లో ప్రథమ ర్యాంకు

బోనకల్: మండలంలోని చొప్పకట్లపాలెం గ్రామానికి చెందిన కొనకంచి రత్నకుమారి రాష్ట్రస్థాయిలో67వ ర్యాంకు సాధించింది. భద్రాద్రి జోన్ పరిధిలో ప్రథమ స్థానంలో నిలిచింది. రత్న కుమారి ఏడు సంవత్సరాల నుంచి మహబాద్ జిల్లా ఏరియా ఆసుపత్రిలో కాంట్రాక్టు పద్దతిలో స్టాఫ్‌నర్సుగా విధులు నిర్వహిస్తుంది.



విజయను అభినందిస్తున్న డీఎం రాజ్యలక్ష్మీ



రత్నకుమారి,నాగరాజు,శ్రీలక్ష్మీదంపతులు, గీతాంజలి

స్పెల్ విజార్డ్ డ్రామా పోటీల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ

ఖమ్మంఖానాపురంహవేలి, జనవరి30: స్పెల్ విజార్డ్ డ్రామా పోటీలు సోమవారం రాత్రి నగరంలోని ప్రభుత్వ పాఠశాల రిక్కాబజార్ పాఠశాలలో నిర్వహించారు. ఈ పోటీలలో నగరంలోని ఖాజీపుర పాఠశాల విద్యార్థి ఉమామహేశ్వరి, రెసిడెన్షియల్ విభాగంలో శ్రీవల్లి, డ్రామా విభాగంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు, రెసిడెన్షియల్ విభాగంలో టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ టేకులపల్లి విద్యార్థులు గెలుపొందారని మండల కన్వీనర్ శాంతారెడ్డి, కో కన్వీనర్ స్నేహలత తెలిపారు. ఉదయం నుంచా సాయంత్రం వరకు జరిగిన ఈ కార్యక్రమానికి పొంగిలేటి స్వరాజ్యం రాఘవరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ భోజన సదుపాయాలు అందించారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తుంబూరి దయాకరెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్, హెచ్‌ఎం శాంత, శంకరావు, లక్ష్మీ పాల్గొన్నారు.

అనాథ విద్యార్థులకు చేయూత

తల్లాడ, జనవరి30: తల్లిదండ్రులులేని అనాథ విద్యార్థులకు బిగ్‌హెల్ప్ సంస్థ చేయూతనందించింది. మంగళవారం తల్లాడ మండలం కుర్నవల్లిలోని జడ్పీఉన్నత పాఠశాలలో పదిమంది అనాథ విద్యార్థులకు సహాయం అందించే ప్రాజెక్టును ప్రారంభించారు. బిగ్‌హెల్ప్ వ్యవస్థాపక చైర్మన్ షేక్.చాంద్‌పాషా ఆర్థిక సహకారంతో పదిమంది విద్యార్థులకు దుస్తులు, బ్యాగులు, స్టడీమెటీరియల్‌ను అందజేశారు. ప్రతినెలా రూ.250 చొప్పున చదువు పూర్తయ్యేవరకు ఆర్థికసాయం అందించనున్నట్లు ఆర్గనైజర్ షేక్.లాల్‌మహ్మద్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ అయిలూరి లక్ష్మీ, ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీరాణి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

3న మెగా జాబ్‌మేళా

ఖమ్మంకలెక్టరేట్,జనవరి30: యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ఫిబ్రవరి 3న నిర్వహించే మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో మెగా జాబ్ మేళా పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. సర్దార్ పటేల్‌స్టేడియంలో చేపట్టనున్న మెగా జాబ్ మేళా ఉదయం 10గంటల నుంచి ప్రారంభం అవనున్నట్లు తెలిపారు. 5వేలకు పైగా ఉద్యోగాలకు నియామకం చేసుకోనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు హెల్ప్ లైన్ నెంబర్లు 8886711991, 9642333668 సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన సర్వీసులు, క్రీడల అభివృద్ధి అధికారి సునీల్ రెడ్డి, జిల్లా ఉపాధికల్పన అధికారి కె. శ్రీరామ్, అదనపు పౌరసంబంధాల అధికారి వల్లోజి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గుండె పోటుతో మాజీ సర్పంచ్ మృతి

ఖమ్మంరూరల్, జనవరి30: మండల పరిధిలోని గుర్రాలపాడు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, సీపీఎం సీనియర్ నాయకులు బుర్రవెంకటేశ్వర్లు (62) గుండె పోటుతో మంగళవారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, విద్యాసంస్థల అధినేత ఉషాకిరణ్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్, ఆంధ్రబ్యాంక్ సొసైటీ చైర్మన్ బీరెడ్డి నాగచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ తమ్మినేని విజయలక్ష్మీ మృతదేహన్ని సందర్శించి నివాళులర్పించారు.

సీపీఎస్ ను రద్దు చేయిస్తాం: ఎస్టీఎఫ్

చింతకాని జనవరి 30: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరిస్తామని ఎస్టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులు అన్నారు. మంగళవారం ఎస్‌టీఎఫ్ క్యాంపెయిన్‌లో భాగంగా పాతర్లపాడులో సమావేశం నిర్వహించారు.

మూత్రపిండాలను కాపాడుకోవాలి

కాకతీయ డయాలసిస్ వార్షికోత్సవం సందర్భంగా ఉచిత వైద్యసేవలు



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న యాలమూడి మనోజ్‌కుమార్

ఖమ్మం కలెక్టరేట్, జనవరి30: నిరంతర అప్రమత్తతతో కిడ్నీ జబ్బుల బారిన పడకుండా కాపాడుకోవచ్చని, ఒత్తిడి లేని జీవన విధానంతో సహజసిద్దమైన అలవాట్లతో కిడ్నీలను జాగ్రత్తగా ఉంచుకోవడం అవసరమని ప్రముఖ నెఫ్రాలజిస్ట్ , కాకతీయ డయాలసిస్ అధినేత డాక్టర్ యాలమూడి మనోజ్‌కుమార్ అన్నారు. అధికరక్తపోటు మధుమేహం పై ప్రతి మూడు నెలలకోమారు పరీక్షలు చేసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం ఆస్పత్రి నాలుగో వార్షికోత్సవం సందర్భంగా కాకతీయ కిడ్నీ, డయాలసిస్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన రోగులకు అవగాహన కల్పించారు. వార్షికోత్సవం సందర్భంగా రోగులను పరిక్షించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మనోజ్‌కుమార్, యాలమూడి కృష్ణయ్య , రవి పాల్గొన్నారు.

వలస కార్మికుల పిల్లలు బడిలో చేరిక

చింతకాని,జనవరి30: మండల పరిధిలోని తిరుమలాపురం గ్రామంలోని ఇటుక బట్టీలలో పనిచేస్తున్న వలస కార్మికుల పిల్లలను సర్పంచ్ బండి రమాదేవి, పంచాయతీ కార్యదర్శి మరీదు రాధిక చొరవతో మంగళవారం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నమోదు చేయించారు. విద్యార్థులు పని ప్రదేశాలలో కాదని పాఠశాలలో ఉండాలన్నారు.

ధాన్యం డబ్బుల కోసం ఎదురు చూపులు



గరికపాడు సొసైటీ కార్యాలయం

వైరా,జనవరి30: వర్షాకాలం వ్యవసాయ సీజన్ ధాన్యం సొమ్ములు రాక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.ధాన్యం విక్రయించి 45రోజులు కావస్తున్నా తమకు ప్రభుత్వం నుంచి సకాలంలో డబ్బులు రావడం లేదని రైతులు వాపోతున్నారు. గత 15 రోజుల నుంచి నగదు చెల్లింపులు పూర్తిగా నిల్చిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ వ్యాపారులు సైతం నెలల తరబడి రైతులకు డబ్బులు చెల్లించకుండా వాయిదాల మీద వాయిదాలు పెడుతూ కాలం వెళ్లదీస్తున్నారు. వైరా మండలంలోని వైరా, గరికపాడు, పూసలపాడు సొసైటీల పరిధిలో పౌరసరఫరాలశాఖ అలాగే వ్యవసాయ మార్కెట్ యార్డుతోపాటు కొన్ని గ్రామాల్లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లు చేశారు. వైరా సొసైటీ పరిధిలో 762 మంది రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇప్పటివరకు 225మంది రైతులకు మాత్రమే రూ.3కోట్ల, 31లక్షల, 56వేల 277ను చెల్లించారు. ఇంకా 537మంది రైతులకు రూ.9కోట్ల, 97లక్షల, 41వేల, 130ను చెల్లించాల్సి ఉంది. గరికపాడు సొసైటీ పరిధిలో మొత్తం 451మంది రైతుల నుంచి కొనుగోలు చేశారు. ఇప్పటివరకు కేవలం 236మంది రైతులకు రూ.3కోట్ల, 2లక్షల, 17వేల, 086మాత్రమే చెల్లించారు. ఇంకా 215మంది రైతులకు రూ.2కోట్ల, 88లక్షల, 74వేల, 541చెల్లించాల్సి ఉంది. పూసలపాడు సొసైటీ పరిధిలో 45మంది రైతుల నుంచి కొనుగోలు చేశారు. ఇప్పటివరకు కేవలం 25మంది రైతులకు రూ.66లక్షల, 06వేల, 138మాత్రమే డబ్బులు చెల్లించారు. ఇంకా 20మంది రైతులకు రూ.49లక్షల, 92వేల, 834చెల్లించాల్సి ఉంది. డీసీఎంఎస్ పరిధిలో వందలాదిమంది రైతుల దగ్గర కొనుగోలు చేసిన వేలాది క్వింటాళ్ల ధాన్యానికి కోట్లాదిరూపాయల డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. పౌరసరఫరాల శాఖలో డబ్బు లేక రైతుల ఖాతాలకు జమచేయడం లేదు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పరిస్థితి ఇలా ఉంటే అధిక ధరల ఆశచూపి లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసిన ప్రైవేట్ వ్యాపారులు సైతం వేలాదిమంది రైతులకు కోట్లాది రూపాయలు చెల్లించకుండా వాయిదాలతో కాలయాపన చేస్తున్నారు. తాము పెట్టుబడుల కోసం అప్పులు తెచ్చిన చోట తిరిగి ఆబాకీని చెల్లించేందుకు రైతులు ఆందోళన చెందుతున్నారు. వరికోత యంత్రాలు, కూలీలకు డబ్బులు ఇవ్వలేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. వెంటనే ప్రభుత్వం ధాన్యం సొమ్మును ఖాతాల్లో జమచేయాలని రైతులు వేడుకుంటున్నారు.

భట్టికి అభినందనలు తెలుపుతూ తీర్మానం

మధిర మునిసిపల్ సమావేశంలో పలు అంశాలపై చర్చ



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మొండితోక లత

మధిరటౌన్,జనవరి30: మధిర శాసనసభ్యుడు మల్లు భట్టి విక్రమార్క ఉపముఖ్యమంత్రి కావడంతో ఆయనను అభినందిస్తూ మధిర మునిసిపాలటీ పెట్టిన తీర్మానాన్ని ఏకగ్రీంగా ఆమోదించారు. మంగళవారం మధిర మునిసిపాలిటీ జనరల్‌బాడీ సమావేశాన్ని చైర్‌పర్సన్ మొండితోక లత అధ్యక్షతన నిర్వహించారు. మధిర అంబేడ్కర్ సెంటర్ నుంచి శివాలయం వరకు రోడ్డు విస్తరణ చేపట్టేందుకు చైర్‌పర్సన్ పెట్టిన తీర్మానాన్ని, ఉప ముఖ్యమంత్రి భట్టిని అభినందిస్తూ కౌన్సిలర్ మల్లాది వాసు పెట్టిన తీర్మానాన్ని ఏకగ్రీంగా అమోదించారు. మధిరలో కోతుల బెడద తొలగించాలని, పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని, మునిసిపల్ కార్మికులకు మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని పలువురు కౌన్సిలర్లు కోరారు. ఈ సమావేశంలో కమిషనర్ రమాదేవి, ఏఈ నరేష్‌రెడ్డి, మేనేజర్ రవీందర్ వైస్ చైర్‌పర్సన్ శీలం విద్యాలత, కౌన్సిలర్లు పాల్గొన్నారు.